MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 4 రంగారెడ్డి డిసెంబర్ 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

## వరుసగా ఐదవ వత్సరం ! జాతీయ పురస్కార మహోత్సవం !




ఉత్తమ నిర్వహణతో అవార్డులను గెలుచుకున్న స్వయంసహాయ సమాఖ్యల ప్రతినిధులతో ముఖ్య అతిధులు, నిర్వాహకులు

ఐదవ
వార్షిక
జాతీయ
సమ్మేళనం

### జాతీయ సమ్మేళనంలో ప్రసంగించిన ప్రముఖులు



దివ్యాదేవరాజన్ , శాంతి కుమారి , కె.మాధవరావు , జి.చిన్నారెడ్డి



మహాపర్ అలి, సి ఎస్ రెడ్డి, జిజీ మెమన్, జి ఎన్ గోయల్, రవీందర్ రావు

ఏపిమాస్‌కు
'వాష్'
హ్యాట్రిక్
అవార్డు !




తొలిరోజు ప్రధాన సదస్సు దృశ్యం

Silver Jubilee Year
apmas
Empowering Communities




అవార్డును అందుకున్న శ్రీ కె శ్రీనివాస్

NABARD
నాబార్డ్ సౌజన్యంతో....


# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...


వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
క్రుంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు



## జీవనోపాధులపై....



పెరిగే వలసలు

రోగాలతో పెరుగుతున్న ఖర్చులు

ఆహార భద్రతకు ముప్పు

పోషకాహార లోపాలు

తగ్గే ఉపాధి అవకాశాలు

పంట నష్టాలతో పెరిగే అప్పులు

NABARD

# మహిళా సాధికారత


సంపుటి 24 సంచిక 4




సంపాదకీయం

## ఆలోచనాత్మకం !

స్వయం సహాయ సమాఖ్యలు (ఎస్ హెచ్ జి ఫెడరేషన్లు), ఎఫ్ పి ఓ లపై నవంబర్ 20–21తేదీలలో హైదరాబాదులో ఏపిమాస్ నిర్వహించిన రెండు రోజుల జాతీయ సమ్మేళనం ఉత్సాహభరిత వాతావరణంలో, ఎన్నో అనుభవాల , వివిధ సూచనల కలబోతగా, అర్ధవంతమైన చర్చోపచర్చలతో సాగి, మార్గదర్శకంగా, ప్రభావోత్పాదకంగా, ప్రేరణాత్మకంగా ముగిసింది. వేదికపైన కేవలం రెండు రోజుల ముచ్చటే అయినా, ఇది సాధారణ కార్యక్రమం కాదు. దాదాపు సగం భారతదేశం ఒకే వేదికపై ప్రాతినిధ్యం వహించిన, అనుభవాలను, ఆలోచనలను పంచుకున్న సందర్భం సాధారణం ఎలా అవుతుంది? పాలకవర్గం, ఆర్ధిక సహాయ సంస్థలు, భాగస్వాములు, శ్రేయోభిలాషులు, మరెందరెందరో యిందులో కీలక పాత్ర పోషించారు. ఏపిమాస్ సిబ్బంది సంగతి సరే సరి! అంకితభావంతో కొన్ని నెలలపాటు సాగించిన కృషికి పర్యవసానంగానే జాతీయ సమ్మేళనాన్ని ఫలప్రదంగా నిర్వహించగలిగాము. వీరందరికి, జాతీయ సమ్మేళనంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాల్గొని విలువైన సూచనలను అందించిన వారందరికి అనేకానేక ధన్యవాదాలు. ఉత్తమమైన పనితీరుతో పురస్కారాలను గెలుచుకున్న స్వయంసహాయ సమాఖ్యలకు మరోమారు హృదయపూర్వక అభినందనలు ! వీరి విజయ ప్రస్థానం మరెందరికో ప్రేరణ కలిగించాలని, మార్గదర్శకం కావాలని, సమీప భవిష్యత్తులో అన్నీ ఉత్తమోత్తమ సమాఖ్యలుగా రూపుదిద్దుకోవాలన్నదే ఏపిమాస్ ప్రగాఢ ఆకాంక్ష! ఆ ఆకాంక్ష కార్యరూపమేకదా ఈ సమ్మేళనం, ఈ పురస్కార మహోత్సవం! ఇక ఈ సమ్మేళనం వేదికగా సమాఖ్యల ప్రతినిధులు, ప్రముఖులు వ్యక్తంచేసిన కొన్ని అభిప్రాయాలు ఎంతో ఆలోచనాత్మకంగా వున్నాయి. స్వయంసహాయ సమాఖ్యలు పొదుపు సొమ్మయినా, రుణాలరూపంలోనైనా వేల,లక్షల కోట్ల రూపాయల నిధులను నిర్వహిస్తున్నాయి. కాని, ఈ నిధులు స్వయంసహాయ ఉద్యమం ఆశించిన, ఉపయోగపడవలసిన రీతిలో ఉపయోగపడుతున్నాయా అన్న ప్రశ్న చాలాకాలంగా వినిపిస్తున్నదే. అదే ప్రశ్న మరింత బలంగా ఈ వేదిక మీద ప్రతిధ్వనించింది. చాలా సందర్భాలలో స్వయం సహాయ సంఘాలు, సమాఖ్యలు తమ నిధులను కుటుంబ ఖర్చులకో, ఇతర అనుత్పాదక అవసరాలకో వెచ్చిస్తుండగా, కొన్ని మాత్రం కొద్దిపాటి పెట్టుబడులతో చిన్నచిన్న వ్యాపారాలను, పరిశ్రమలను నిర్వహిస్తూ, స్వల్ప ఆదాయాలను గడిస్తున్నాయి. భారీ వ్యాపారాలను, పరిశ్రమలను నిర్వహిస్తూ గణనీయమైన ఆదాయాలను ఆర్జించే సమాఖ్యలను బహుశా వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. గొర్రె తోక బెత్తెడు అన్నట్టు ఈ బొటాబొటి ఆదాయాలతో కుటుంబాలు ఆర్ధిక స్వావలంబన ఎప్పటికి సాధించగలుగుతాయి? అందుకే, ఇప్పుడు ఆ తీరు మారాలని పలువురు వక్తలు హితవు పలికారు. సంఘటితంగా భారీ వ్యాపారాలను నిర్వహిస్తూ, గణనీయమైన ఆదాయాలు ఆర్జించి, ఆర్ధిక స్వావలంబన సాధించాలని వారు సూచించారు. స్వయంసహాయ ఉద్యమం పేదరికం దశ దాటిందని, యిప్పుడు యిక సుసంపన్న స్థితిని సాధించే దిశగా ముందడుగు వేయాలని వారు ఆకాంక్షిస్తున్నారు. ఇది తప్పక పాటించవలసిన సలహా. మరోవైపు, స్వయం సహాయ మహిళల సంపాదనంతా మగవారి తాగుడుకే సరిపోవడంలేదని, అఖరుకు తరుణవయస్కులైన పిల్లలుకూడా తాగుడుకు బానిసలవుతున్నారని, గృహహింస చెలరేగుతూనే వున్నదని ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ మాధవరావు గారు వెలిబుచ్చిన ఆవేదన ఎంతైనా ఆర్ధవంతమైనది. అభివృద్ధి అంటే యిదేనా? ... అని ఆయన వేసిన ప్రశ్న గుండెలను కలుక్కుమనిపించక మానదు. ఎస్ హెచ్ జి లు కేవలం ఆర్ధికపరమైన అంశాలకే పరిమితంకాకుండా, తమ సంఘటిత శక్తితో సామాజిక సమస్యలపట్ల దృష్టి సారించాలని, యిలాంటి సామాజిక దురాచారాలపై పోరాటం సాగించాలని యిదే వేదికపైనుంచి దివ్యా దేవరాజన్ గారు, సంధ్యారాణి గారు, మరికొందరు చేసిన సూచనలు ఈ సమస్యకు ఒక సబబైన పరిష్కారం కావచ్చు. ఎస్ హెచ్ జిలు ఈ దిశగా కార్యాచరణకు ఉపక్రమించాలి. ఎపిమాస్‌కు ఈ జాతీయ సమ్మేళనం, పురస్కారోత్సవం అందించిన ఆనందంతోపాటు కొంచెం అటూ యిటుగా యిదే సమయంలో మరో ఆనందదాయకమైన విశేషం కలసివచ్చింది. వాటర్ ఆర్గ్ తోడ్పాటుతో ఏపిమాస్ నిర్వహిస్తున్న 'వాష్' ప్రాజెక్టుకు వరుసగా మూడవ ఏడాది సా–ధన్, వాటర్ ఆర్గ్ అవార్డు లభించింది. ఈ హ్యాట్రిక్ అవార్డు రావడానికి ఉత్తమ కృషి చేసిన ఏపిమాస్ బృందానికి, యితర భాగస్వాములకు అబినందనలు. సా–ధన్, వాటర్ ఆర్గ్ సంస్థలకు దన్యవాదాలు.




**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**


పోటీదారులు నీ పద్ధతులను, పనితీరును అనుకరించవచ్చు, కాని నీ అంకితభావాన్ని ఎవరూ అనుకరించలేరు

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి, సాంకేతిక సహకారం: క్రిస్టాఫర్ వసంత్**


## లోపలి పేజీలలో ....


- మెరుగైన ఉపాధితో సుసంపన్న స్థితికి ... ! 05
- సామాన్యజీవనం, ఉన్నత ఆలోచనం,ఆచరణం 10
- ఆర్థిక క్రమశిక్షణే వ్యాపారవిజయానికి మూలం 11
- మామిడి మార్కెటింగ్ప్రణాళిక అవసరం: సిఎస్ 15
- మరుగుదొడ్ల వినియోగంపై సదస్సులు 16
- ఏపిమాస్‌కు 'హ్యాట్రిక్' 'వాష్ అవార్డ్ ! 17
- 4గురు మహిళలకు రామోజీఎక్సలెన్స్ అవార్డులు 18
- ఏపీలో డ్వాక్రా మహిళలకు 9 క్లస్టర్లతో ఉపాధి 21
- అంథుల క్రికెట్‌లో వరల్డ్‌కప్‌నందించిన దీపిక 22
- తెలుగమ్మాయికి అంతరిక్ష యాత్ర అవకాశం! 24
- మంచిర్యాలలో భారత రాజ్యాంగ దినోత్సవం 26
- బిందుసేద్యం రైతులకు 55శాతం రాయితీ! 27
- స్వయంసహాయ మహిళలకు వడ్డీలేని రుణాలు 28
- అమ్మాయిలజీవితాల్లో అభయవిద్యానిధి వెలుగులు 30
- పిల్లలు ఒంటరిగావుంటే జాగ్రత్తలు తప్పనిసరి 31
- వేడుకలలో అలంకరణకు అద్దె మొక్కలు ! 33
- 'పాడి రైతులకు అండగా వున్నందుకే అవార్డు' 34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్లకు | : | రూ. 200 |
| మూడేళ్లకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


చెడ్డ వ్యక్తుల దుర్మార్గాల కంటె మంచి వ్యక్తుల మౌనమే అత్యంత ప్రమాదకరం

# మెరుగైన ఉపాధితో సుసంపన్న స్థితికి ... !

## స్వయం సహాయ సమాఖ్యలకు ఏపిమాస్ జాతీయ సమ్మేళనం మార్గదర్శనం

*అవి: 2025 నవంబర్ 20-21 తేదీలు. అది: హైదరాబాద్ మహానగరం జుబ్లీహిల్స్‌లోని సుప్రసిద్ధ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ' (ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ) ఆడిటోరియం. అక్కడి దృశ్యం: వివిధ రాష్ట్రాలనుంచి వచ్చి , విభిన్న వర్ణశోభిత వస్త్రధారణతో , ఉత్సాహం ఉరకలువేస్తున్న స్వయంసహాయ (ఎస్ హెచ్ జి) మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటూ , సంక్షిప్త భారతావని కొలువుకూటాన్ని తలపించే కమనీయ అనుభూతి! సందర్భం : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పేరు ప్రఖ్యాతులు గడించిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఏపిమాస్ నిర్వహిస్తున్న మహా సమ్మేళనం. విశేషం: స్వయంసహాయ సమాఖ్యలు, ఎఫ్ పి ఓలపై జాతీయ సమ్మేళనం, ఉత్తమ స్వయంసహాయ సమాఖ్యలకు పురస్కారాల ప్రదానోత్సవం. మరింత విశేషం: ఏపిమాస్ ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తుండడం వరుసగా యిది ఐదవ సంవత్సరం కావడం! ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాలకు చెందిన ఎందరో ఆతిరథ, మహారథులు కొలువుతీరి వుండడం!*

*ఆ మహోత్సవం యిలా సాగింది.*

**అ**ది ఒక పండుగ ! ఒక అభినందనోత్సవం ! నిద్రాణమైన నిగూఢ శక్తిని తట్టిలేపే ప్రేరణాత్మక ప్రయోగం! స్వయంసహాయ సమాఖ్యల పునర్ వైభవానికి ఏపిమాస్ దీక్షతో సాగిస్తున్న పురస్కార మహాయజ్ఞం! ఆశించిన సత్ఫలితాలను అందిస్తున్న విజయ ప్రస్థానం!



ఎంతో ఉరవడిగా, మహోధృతంగా సాగిన మహిళా స్వయం సహాయ మహోద్యమం కాలక్రమేణా, గిరిగీసుకున్నట్టు పొదుపులు, అప్పులకే పరిమితమై, ఆశించిన అభివృద్ధిని సాధించడం మరచి, మందకొడిగా మారిన దుస్థితిని గమనించిన ఏపిమాస్, తొలినుంచి ఆ ఉద్యమ కీలక భాగస్వామిగా, మార్గదర్శిగా, ప్రోత్సాహక సంస్థగా ఎంతో ఆవేదనకు గురైంది. ఆ ఉద్యమాన్ని తిరిగి గాడిన పెట్టాలని ఎంతగానో మానసిక సంఘర్షణ పడింది. ఆ సంఘర్షణ ఫలితమే సరిగ్గా నాలుగేళ్ళ క్రితం మొదలైన ఈ జాతీయ ఉత్తమ స్వయంసహాయ సమాఖ్యల పురస్కార ప్రదానోత్సవం! ఆకుంఠిత దీక్షతో వరుసగా ఐదవ ఏడాది ఈ జాతీయ సమ్మేళనాన్ని, పురస్కారోత్సవాన్ని ఎంతో ఘనంగా ఏపిమాస్ నిర్వహించింది.

> కోటి మంది స్వయంసహాయ మహిళలను కోటీశ్వరులను చేయాలన్నది తెలంగాణా ప్రభుత్వ సంకల్పం – జి చిన్నారెడ్డి

తెలంగాణా ప్రభుత్వ ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి గారు, ఏపిమాస్ ఛైర్మన్ , విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. మాధవరావు గారు, ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి గారు, సెర్ప్ తెలంగాణా సి ఇ ఓ దివ్యా దేవరాజన్ గారు, రాష్ట్రాల సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య అధ్యక్షులు రవీందర్ రావు గారు, స్టేట్ బ్యాంక్ ఛీఫ్ జనరల్ మేనేజర్ (ఏ బి యు–జి ఎస్ ఎస్ – ముంబై) గోవింద్ నారాయణ్ గోయల్ గారు, చైతన్య సంస్థ మేనేజింగ్ ట్రస్టీ

మెచ్చుకునే వారి కంటె విమర్శించే వారి వల్లనే ఎక్కువ మేలు జరుగుతుంది, సామర్థ్యం పెంచుకోవడానికి వారే మూలం




సుధా కొఠారి గారు, సా–ధన్ సంస్థ సి ఇ ఓ జిజీ మమ్మెన్ గారు, ఏపిమాస్ వైస్ ఛైర్ పర్సన్ మహాపర అలీ గారు, పాలకవర్గం సభ్యులు ఎన్ వి రమణ గారు, పి. మోహనయ్య గారు, సంధ్యారాణి గారు, ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి సి ఎస్ రెడ్డి గారు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామలక్ష్మి గారు, పురస్కార విజేతలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్వయం సహాయ సమాఖ్యల ప్రతినిధులు, జీవిక, సెర్ప్, స్త్రీనిధి ప్రతినిధులు, ఏపిమాస్ సిబ్బంది, యింకా పలువురు ప్రముఖులు ఈ రెండు రోజుల జాతీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

ముఖ్య అతిధులు, నిర్వాహకులు, స్వయంసహాయ మహిళల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలనతో, దేశభక్తి గీతాలాపనతో తొలిరోజు సమ్మేళనం ప్రారంభమైంది. మొత్తం 17 రాష్ట్రాల నుంచి వచ్చిన స్వయం సహాయ సమాఖ్యల ప్రతినిధులతోపాటు, 200 మందికి పైగా పాల్గొన్న సమ్మేళనమది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, డి జి ఆర్ వి–జర్మనీ, సా–ధన్ , బఫా, ఎఫ్ డబ్ల్యు డబ్ల్యు బి, స్త్రీనిధి–తెలంగాణా, ప్రదాన్ సంస్థలు ఈ జాతీయ సమ్మేళన, పురస్కారోత్సవాలకు సహకారం అందించాయి.

**రామారెడ్డికి శ్రద్ధాంజలి**

ఇటీవల పరమపదించిన సహకార ఉద్యమ సారథి, సహ వికాస సంస్థ వ్యవస్థాపకుడు, తన యావజ్జీవితాన్ని సమాజ సేవకు అంకితంచేసిన మహనీయుడు శ్రీ మామిడి రామారెడ్డికి స్మృత్యంజలి ఘటిస్తూ, సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది.

**ఆర్థికంగా మరింత ముందడుగు ...**

అనంతరం, రెండు రోజులపాటు జరిగిన సదస్సులలో ప్రసంగించిన వక్తలలో పలువురు స్వయంసహాయ ఉద్యమం ప్రస్తుతం పేదరిక నిర్మూలన దశనుంచి, సుస్థిరాభివృద్ధి దశకు చేరుకుంటున్నదని, పొదుపుల రూపంలో, బ్యాంక్ రుణాల రూపంలో స్వయంసహాయ మహిళలవద్ద భారీ మొత్తంలో నిధులు అందుబాటులో వున్నాయని పేర్కొన్నారు. ఆయితే, నిధులు ఎంతగా వున్నప్పటికి వాటిని సద్వి నియోగం చేసుకోవడంలో సమస్య తలెత్తుతున్నదని, కేవలం కుటుంబ అవసరాలకు, వేడుకలకు వినియోగిస్తుండడం, చిరు వ్యాపారాలకు మాత్రమే పరిమితం అవుతుండడంతో సంపన్న స్థితికి చేరుకోలేకపోతున్నారని, అందువల్ల స్వయం సహాయ సమాఖ్యలు యిక గణనీయమైన ఆదాయం పొంద గలిగే పరిశ్రమలను, వ్యాపారాలను, ఉపాధి అవకాశాలను ఎంచుకుని, సుసంపన్న స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

**ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా నాయకత్వ వ్యవస్థ**

జాతీయ సమ్మేళనం మొదటిరోజున ఏపిమాస్ సిఇఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి స్వాగతోపన్యాసంచేస్తూ, ఈ నాలుగేళ్ళ సమ్మేళన, పురస్కారోత్సవ నేపథ్యాన్ని, ప్రస్థానాన్ని క్లుప్తంగా వివరించారు. ఈ ఏడాది వరుసగా ఐదవ సంవత్సరం పురస్కారాలను అందిస్తుండడం, ఇది అంతర్జాతీయ సహకారోత్సవ సంవత్సరం కావడం, ఇంతేకాకుండా యిది ఏపిమాస్ రజితోత్సవ సంవత్సరం కూడా కావడం ఎంతో విశేషమని శ్రీ సి ఎస్ అన్నారు. ఆయన భారతీయ స్వయం సహాయ ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తూ, దేశంలో 1.5 కోట్ల స్వయం సహాయ సంఘాలు ( ఎస్ హెచ్ జి లు), 6 లక్షల సమాఖ్యలు, 15 కోట్ల మంది సాధికార స్వయంసహాయ మహిళా సభ్యులు వున్నారని, ప్రపంచంలోనే మహిళలు నాయకత్వ పాత్ర వహిస్తున్న అతిపెద్ద సామాజిక వ్యవస్థలలో భారత స్వయంసహాయ ఉద్యమం పేరెన్నికగన్నదని తెలిపారు. ప్రస్తుతం వారి వద్ద 2 లక్షల కోట్ల రూపాయల పొదుపు నిధులు, 3 లక్షల కోట్ల రూపాయల రుణ నిధులు, మొత్తంగా 5 లక్షల కోట్ల రూపాయల రుణ నిధులను వారు నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు.

ఇటీవల కన్నుమూసిన సహకారోద్యమ సారథి శ్రీ మామిడి రామారెడ్డికి ఆయన ఘన నివాళులర్పిస్తూ, అవిభక్త

గౌరవం రెండు విధాలుగా వస్తుంది ; అధికారంతో లేదా ప్రవర్తనతో ; మొదటిది తాత్కాలికం, రెండవది శాశ్వతం!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా సహకార వ్యవస్థలో అనేక సంస్కరణలకు, రాజ్యాంగ సవరణలకు శ్రీ రామారెడ్డి ఎంతగా చొరవచూపింది, మాక్స్ చట్టం రూపకల్పనలో ఎంతటి క్రియాశీల పాత్ర పోషించింది ఆయన గుర్తు చేసుకున్నారు.

**కొత్తగా లక్ష మంది మహిళలకు పదవులు**

అనంతరం తెలంగాణా సెర్ప్ సి ఇ ఓ దివ్యా దేవరాజన్ గారు ప్రసంగిస్తూ, తెలంగాణాలో గ్రామ స్థాయిలో కొత్తగా లక్ష మంది మహిళలు వివిధ పదవులు పొందగలిగారని, యిది స్వయంసహాయ ఉద్యమ ఫలితమేనని చెప్పారు. మహిళా సమాఖ్యల కృషి ఫలితంగా ఈనాడు తెలంగాణాలో ఎస్‌హెచ్‌జి మహిళలు 25,000 కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు పొందగలిగారని ఆమె అన్నారు. వారు పత్తి జిన్నింగ్, ఎగుమతులను, పాలశీతలీకరణ కేంద్రాలను నిర్వహించ గలుగుతున్నారని కొనియాడారు. మహిళా గ్రూపులే కాకుండా, కిశోర బాలికా సంఘాలను, వృద్ధ మహిళా సంఘాలనుకూడా ఏర్పాటు చేయాలని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నట్టు ఆమె తెలిపారు.

అయితే, ఎస్ హెచ్ జి మహిళలు కేవలం తాము పొదుపు చేయడానికి, అప్పులు పొందడానికి మాత్రమే పరిమితం కాకుండా సామాజిక అంశాల పట్ల శ్రద్ధ వహించాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతి యింటికి మరుగుదొడ్డి పథకంలో చెప్పుకోదగిన పురోగతి సాధించినా, తెలంగాణా రాష్ట్రంలో యిప్పటికీ మరుగుదొడ్లులేని యిళ్ళు వున్నాయని, ఈ సామాజిక సమస్యను స్వయంసహాయ సంఘాల మహిళలు కలసికట్టుగా ఎదుర్కోవాలని ఆమె సూచించారు.

**ఆర్థిక సుసంపన్నత**

సా-ధన్ సంస్థ సి ఇ ఓ శ్రీ జిజీ మమ్మెన్ ప్రసంగిస్తూ, స్వయంసహాయ మహిళలు యిప్పుడు పేదరికం స్థాయిని దాటేశారని, యిక వారు మంచి వ్యాపారాలను, పరిశ్రమలను చేపట్టి సుసంపన్న మహిళలుగా రూపొందాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'లక్షాధికారి దీదీ' పథకాన్ని ప్రస్తావించారు.

**ఒక్కొక్క గ్రూపునకు 30 లక్షలు**

రాష్ట్రాల సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య అధ్యక్షులు రవీందర్‌రావు గారు మాట్లాడుతూ, గత 24 సంవత్సరాలుగా మహిళలకు, ఎఫ్ పి ఓ లకు విశేష సేవలు చేస్తున్న ఏపిమాస్ విశిష్ట కృషిని అభినందించారు. కరీంనగర్ జిల్లాలో నేత కార్మికులు భారీ సంఖ్యలో మరణిస్తుంటే, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బారినుంచి వారిని కాపాడడంకోసం తమ సంస్థ స్వయంసహాయ మహిళలకు రుణాలు యిచ్చి ఆదుకున్నదని, వారు ఎంతో క్రమశిక్షణతో ఆర్థిక నిర్వహణ సాగిస్తుండడంతో యిప్పుడు ఒక్కొక్క గ్రూపునకు 30 లక్షల రూపాయల వరకు యివ్వగలుగుతున్నామని ఆయన చెప్పారు. ఎస్ హెచ్ జి లలో బలహీనమైన అంశం పుస్తక నిర్వహణ అని, వారు ఈ బలహీనతను అధిగమించడానికి ఏపిమాస్ ఎంతగానో కృషిచేస్తున్నదని ఆయన ప్రశంసించారు.

**భారీ స్థాయి వ్యాపారాల తరుణం**

ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి గారు ప్రసంగిస్తూ, ఐ ఏ ఎస్ అధికారిణిగా వివిధ హోదాలలో తనకు గత 40 ఏళ్ళుగా స్వయంసహాయ ఉద్యమంతో ఎంతో అనుబంధం వున్నదని అన్నారు. ఈనాడు స్వయంసహాయ మహిళలు బస్సులను కొని, ఆర్ టి సి కి అద్దెకు యివ్వగలుగుతున్నారని, సౌరవిద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వానికే విద్యుత్‌ను విక్రయించ గలుగుతున్నారని, పెట్రోలు బంకులు, ఆహార పదార్థాల ప్రాసెసింగ్ యూనిట్లు నిర్వహించగలుగుతున్నారని, ఈ అభివృద్ధిని చూసి తనకు చాలా ఆనందంగా వున్నదని అన్నారు. స్వయంసహాయ మహిళలు యికపై చిన్నచిన్న వ్యాపారాలను, పరిశ్రమలను కాకుండా, భారీస్థాయి వాణిజ్య సంస్థలను ప్రారంభించి, అధిక ఆదాయం పొంది , సుసంపన్న మహిళలుగా రూపొందాలని ఆమె హితవు చెప్పారు. ఈ సందర్భంగా, ఆమె 'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న తెలంగాణా ప్రభుత్వ పథకాన్ని ప్రస్తావించి, ఈ పథకాన్ని మహిళలందరూ చక్కగా ఉపయోగించుకోవాలని కోరారు.

ఈ ప్రారంభ సదస్సుతోపాటు మొదటి రోజున 'ఎస్‌హెచ్‌జీ ఉద్యమ సుస్థిరత, పురోగతి-మహిళల స్వరాలు'

స్నేహ గుణం ఎంతగా నీ బలహీనత అయితే అంతగా నిన్ను మించిన బలశాలి వుండడు

అనే శీర్షికతో ఒక సర్వప్రతినిధి సదస్సు , రెండు సమాంతర సదస్సులు జరిగాయి.

**సమ్మేళనం రెండవరోజు**

జాతీయ సమ్మేళనం రెండవ రోజున పతాక సన్నివేశ మైన పురస్కార ప్రదానోత్సవానికి ముందుగా 'భాగస్వాముల, సంస్థల సంఘటిత కృషితో గరిష్ఠ స్థాయి ప్రభావోత్పాదన' అనే శీర్షికతో ఒక సర్వప్రతినిధి సదస్సు, నాలుగు సమాంతర సదస్సులు జరిగాయి. సర్వప్రతినిధి సదస్సులో ఏపిమాస్ ప్రోత్సాహక సంస్థ డి జి ఆర్ వి – జర్మనీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ కోర్బినియన్ మార్జ్ పరోక్షంగా (వర్చువల్) పాల్గొని, తన సందేశం వినిపించారు.

రెండవ రోజు చివరగా, ఆ సాయంత్రం జరిగిన 'ఉత్తమ ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు పురస్కార ప్రదానోత్సవా'నికి ముఖ్య అతిధిగా తెలంగాణా ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురస్కార ప్రదానోత్సవ సదస్సులో ముందుగా ఏపిమాస్ సిఇఓ, ఎండి శ్రీ సిఎస్ రెడ్డి అవార్డులు సాధించిన సమాఖ్యలను అభినం దిస్తూ, ఆ సమాఖ్యల ప్రతినిధులకు ఆహ్వానం పలికారు.

**దీనిని అభివృద్ధి అందామా?**

సదస్సుకు అధ్యక్షత వహించిన ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు ప్రసంగిస్తూ, స్వయంసహాయ మహిళలు పొదుపులు, రుణాల రూపంలో సంపాదిస్తున్న సొమ్ము సద్వినియోగం కాకుండా, పక్కదారులు పట్టడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డబ్బులు మగవారి తాగుడుకే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయని, తాగివచ్చి యింట్లో ఆడవారిని కొడు తున్నారని, అటు తాగుడు వ్యసనం, గృహహింస తగ్గడానికి బదులు పెరుగుతున్నాయని ఆయన ఆవేదన చెందారు. గతంలో యింటి యజమానులైన మగవారే తాగే వారని, యిప్పుడు ఆఖరుకు 15 ఏళ్ళ పిల్లలు కూడా తాగు తున్నారని,యిది మరింత ఆందోళనకర విషయమని ఆయన అన్నారు. దీనిని అభివృద్ధి అనగలమా అని ఆయన ప్రశ్నించారు. పురోగతి తిరోగమనం బాట పట్టిందని ఆయన బాధపడ్డారు. స్వయంసహాయ మహిళలు యిలాంటి సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

**మూడు శక్తుల త్రిశక్తి రూపం మహిళ**

ఏపిమాస్ పాలకవర్గం సభ్యురాలు శ్రీమతి సంధ్యారాణి ప్రసంగిస్తూ, మహిళల సహజ లక్షణాలైన మూడు శక్తులు వారికి అన్ని సమస్యలను సాధించే శక్తిని యిస్తాయని, ఆ శక్తులే కఠిన శ్రమ చేయగలగడం, ధైర్యం, సహనం అని చెప్పారు. ఈ మూడు సహజ శక్తులు కలిగిన మహిళలు సంఘటితమైతే సాధించలేనిది ఏముందని ఆమె ప్రశ్నించారు. పిల్లలకు యింటినుంచే సామాజిక, మానవీయ విలువలు, స్వచ్ఛత, శుభ్రత రావాలని, ఈ దిశగా వ్యర్థ పదార్థాల నిర్వహణ పట్ల స్వయంసహాయ మహిళలు దృష్టి పెట్టాలని శ్రీమతి సంధ్యారాణి సూచించారు.

**రుణాలు సద్వినియోగం కావాలి**

స్టేట్ బ్యాంక్ ఛీఫ్ జనరల్ మేనేజర్ (ఏ బి యు–జి ఎస్ ఎస్ – ముంబై) శ్రీ గోవింద్ నారాయణ్ గోయల్ మాట్లాడుతూ, స్వయంసహాయ మహిళలు తీసుకుంటున్న రుణాలు సద్వినియోగం కావడంలేదని, వాటిని ఉత్పత్తిదాయకంగా ఉపయోగించే బదులు యింటి ఖర్చులకు, సామాజిక హోదా కోసం ఖర్చుచేస్తుండడం బాధాకరమని అన్నారు. తీసుకున్న రుణాలను తగిన పరిశ్రమల ఏర్పాటుకు, వ్యాపారాల నిర్వహణకు వినియోగించాలని శ్రీ గోయల్ సలహా యిచ్చారు. ఈ రకమైన పెట్టుబడులకోసం ఎంతమొత్తంలోనైనా రుణాలు అందించడానికి బ్యాంకులు సిద్ధంగా వున్నాయని ఆయన అన్నారు. సంఘం, డబ్బులు యివే జీవితం, యిదే అభివృద్ధి కాదని, పిల్లలు మంచి చదువులు చదివితేనే ఆ కుటుంబాలు అభివృద్ధి సాధించినట్టని అన్నారు.

**కోటిమంది మహిళా కోటీశ్వరులు**

సదస్సులో చివరిగా, ముఖ్య అతిధి, తెలంగాణా ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి ప్రసంగిస్తూ, స్వయంసహాయ వ్యవస్థతో తనకు దాదాపు రెండు దశాబ్దాల సాన్నిహిత్యం వుందని అన్నారు.

కోటి మంది స్వయంసహాయ మహిళా సభ్యులను కోటీశ్వరులను చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంతరెడ్డి నాయకత్వంలోని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం సంకల్పిం చిందని, ప్రస్తుతం 65 లక్షల మంది సభ్యులు వున్నారని,




త్వరలోనే మిగిలిన 35 లక్షల మంది సభ్యులను చేర్చుకుని, వివిధ భారీ ఉపాధి అవకాశాలతో వారిని కోటీశ్వర మహిళలుగా తీర్చిదిద్దుతామని విశ్వాసం వ్యక్తంచేశారు.

**పురస్కార ప్రదానం**

అనంతరం, జాతీయ స్థాయిలో, ఐదు ప్రాంతీయ స్థాయిలలో ఉత్తమమైన పనితీరుతో ఏపిమాస్ అవార్డులను గెలుచుకున్న స్వయంసహాయ సమాఖ్యలకు పురస్కారాలను ప్రదానం చేశారు.

జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం తెలంగాణా రాష్ట్రం హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన 'సాయి కృపా మండల సమాఖ్య'కు లభించగా, దక్షిణ ప్రాంతీయ స్థాయిలోని రెండు పురస్కారాలు కూడా తెలంగాణాకే లభించడం విశేషం! నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండలానికి చెందిన జక్రాన్ పల్లి మండల మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి దక్షిణ ప్రాంతీయ ప్రథమ స్థానం లభించగా, నిజామాబాద్‌జిల్లా ఆర్మూర్ మండలానికి చెందిన ఆర్మూర్ మండల పరస్పర సహకార పొదుపు మరియు క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్‌కు దక్షిణ ప్రాంతీయ ద్వితీయ స్థానం లభించింది.

పురస్కార ప్రదానోత్సవం నింపిన ఆనందోత్సాహాలు, గ్రూప్ ఫోటోల సంరంభం, ఆటపాటల మధ్య సమాఖ్యలు, ఎఫ్ పి ఓల భవ్య భవిష్యత్తు పట్ల ఆశాభావాన్ని నింపుతూ, ఈ రెండురోజుల జాతీయ సదస్సు కోలాహలంగా ముగిసింది.

**పురస్కారాలు పొందిన యితర సమాఖ్యలు**

**జాతీయ ద్వితీయ స్థానం: జార్ఖండ్ రాష్ట్రం చత్ర జిల్లా సిమారియా మండలానికి చెందిన బన్వే అజీవిక మహిళా సంకుల్ స్వలంబి**

జాతీయ తృతీయ స్థానం: జార్ఖండ్ రాష్ట్రం చత్ర జిల్లా ఇత్ఖోరి మండలానికి చెందిన ధనఖేరి ఆజీవిక మహిళా సంకుల్ స్వలంబి

పశ్చిమ ప్రాంతీయ ప్రథమ స్థానం: మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లా కుడాల్ మండలానికి చెందిన నవదిశ ప్రభావ సంఘ

పశ్చిమ ప్రాంతీయ ద్వితీయ స్థానం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కుర్ఖెడ మండలానికి చెందిన శక్తిమహిళా ప్రభావ సంఘ

ఉత్తర ప్రాంతీయ ప్రథమ స్థానం: రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా లక్ష్మణ్‌గర్ మండలానికి చెందిన క్రాంతి మహిళా మంచ్

ఉత్తర ప్రాంతీయ ద్వితీయ స్థానం: రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా తనగజీ మండలానికి చెందిన చేతన మహిళా మంచ్ మహిళా మంచ్

ఈశాన్య ప్రాంతీయ ప్రథమ స్థానం: త్రిపురలోని గోమతి జిల్లా తెపానియా మండలానికి చెందిన బిజోయా మహిళా క్లస్టర్ బహుముఖి సమబాయ సమితి లిమిటెడ్

ఈశాన్య ప్రాంతీయ ద్వితీయ స్థానం: అస్సాంలోని టిన్సుకియా జిల్లా మకుమ్ మండలానికి చెందిన పట్కల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ కో ఆపరేటివ్ సొసైటీ

తూర్పు ప్రాంతీయ ప్రథమ స్థానం: బీహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లా సక్రా మమదలానికి చెందిన ఆనంద్ జీవికా వికాష్ స్వలంబి సహకార సమితి లిమిటెడ్

తూర్పు ప్రాంతీయ ద్వితీయ స్థానం: జార్ఖండ్ రాష్ట్రం తూర్పు సింగ్‌భమ్ జిల్లా ఘట్‌శిలా మండలానికి చెందిన బఘూరియా ఆజీవిక మహిళా సంకుల్ సంఘటన్ స్వలంబి సహకార సమితి లిమిటెడ్

# సామాన్య జీవనం, ఉన్నత ఆలోచనం, ఉత్తమ ఆచరణం

## శ్రీ రామారెడ్డి సంతాప సభలో సి ఎస్ రెడ్డి ఘన నివాళి

**ఇ**టీవల కన్నుమూసిన సహకారోద్యమ సారథి శ్రీ రామారెడ్డి సంతాప సమావేశాన్ని వరంగల్లులో నిర్వహించారు. ఈ సంతాప సభలో పాల్గొన్న ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి ఆయనతో తనకు వున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ, శ్రీ రామారెడ్డికి ఘన నివాళులు అర్పించారు. ఆ సంతాప సందేశం ఆయన మాటలలోనే ...

'ఈరోజు రామారెడ్డి గారు లేరు అనే విషయాన్ని అవగాహన చేసుకోవడం కష్టంగా వుంది. నిజానికి ఈ 50వ వార్షికోత్సవ వీడియో చూస్తుంటే రామారెడ్డి గారు నా ఎదురుగా కూచుని మాట్లాడుతున్న ఫీలింగ్ ... అనుభూతి.

రామారెడ్డి గారు అతి సామాన్యమైన వ్యక్తిగా వుంటూ, ఉన్నతమైన ఆలోచనలను, భావనలను కలిగి వుండడం, వాటిని ఆచరణలో పెట్టడం చూశాం. మనందరం ఆయన నుంచి స్ఫూర్తిని పొందాం. సంతృప్తిని పొందాం. రామారెడ్డి గారు, నేను కలిసి కొన్నిసార్లు గుజరాత్‌లో కురియన్ గారు సంస్థ పెట్టిన ఆనంద్ పట్టణానికి వెళ్లాం. అక్కడ ఇర్మా (ఇన్ స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్మెంట్) అనే సహకార వ్యవస్థను బలోపేతం చేసే సంస్థకు ఇద్దరం కలసి వెళ్ళే వాళ్ళం. ఇప్పుడది యూనివర్శిటి అయింది. ఆయనతో కలిసి ప్రయాణం చేయడం ఒక అనుభూతి. ఆయన ఎప్పుడూ ఎదుటివారిని మీరు అంటూ గౌరవంగానే పిలిచేవారు. ఎవరినీ తక్కువచేసి మాట్లాడడం వుండేది కాదు. మొదట్లో నాకు రామారెడ్డి గారితో పెద్దగా పరిచయం వుండేది కాదు. కాని, రానురాను అది విడదీయలేని బంధంగా తయారైంది.

**మూడు అంశాలపై సహ కార్యాచరణ**

ముఖ్యంగా మూడు అంశాలపైన రామారెడ్డి గారు, నేను, ఏపిమాస్ సంస్థ కలిసి పని చేశాం. మొదటిది మాక్స్ చట్టంపైన ఇతర రాష్ట్రాల వారికి శిక్షణలు, సామర్థ్యం పెంపుదల కార్యక్రమాలను కలసి నిర్వహించడం. వందల సంఖ్యలో బ్యాచ్‌లు ఏపిమాస్ ట్రైనింగ్ సెంటర్‌కు, సహ వికాసకు వచ్చేవి. ఎంతమంది వచ్చినా ఆయన ఏనాడూ విసుక్కున్నది కాని, కాదని చెప్పింది కానీ లేదు. ఈ విషయంలో ఎప్పుడైనా ఒక మీటింగ్ వుందనో, శిక్షణ కార్యక్రమం వుందనో, చర్చ వుందనో రమ్మని ఆహ్వానించి నపుడు రామారెడ్డి గారు రానని చెప్పింది కూడా ఎప్పుడూ లేదు. ఒక చిన్న నానో కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చేవారు. ఏమిటి ఇంత చిన్న కారా అని అడిగితే, ఇంతకంటే పెద్దది ఎందుకు అనేవారు. ఆయన సామాన్యమైన వ్యక్తిగా జీవించాడని అన్నది ఇందుకే.

చాలామంది ఈ 500-550 సహకార సంస్థలు వరంగల్లు, కరీంనగర్ ప్రాంతాల్లోనే ఎందుకు వున్నాయి, మిగతాచోట్ల ఎందుకు లేవు , ఇదేమైనా సహకార ద్వీపమా అని అడిగే వారు. దానికి నేను మిగతాచోట్ల ఈ విధంగా పటిష్టమైన పునాది వేసే వారు లేరు అని చెప్పేవాణ్ణి.

సహకార సంస్థలపై ప్రభుత్వాలు అజమాయిషీ చేయాలని, అదుపు చేయాలని చూసేవి. అందుకు ప్రతిగా

(మిగతా 29 వ పేజీలో ...)

### సవరణ

**'మ**హిళా సాధికారత' నవంబర్ సంచికలో 'సహకార ఉద్యమ సారథి రామారెడ్డి కన్నుమూత' అనే శీర్షికన ప్రచురించిన వార్తాకథనంలో శ్రీ రామారెడ్డి గారు మరణించిన తేదీ పొరపాటున 2025 నవంబర్ 25 అని తప్పుగా ప్రచురితమైంది. నిజానికి ఆయన 2025 అక్టోబర్ 26 వ తేదీన కన్నుమూశారు. ఈ పొరపాటుకు చింతిస్తున్నాము

– అసోసియేట్ ఎడిటర్

# ఆర్థిక క్రమశిక్షణే వ్యాపార విజయానికి మూలం

స్వయం సహాయ సమాఖ్యలు, ఎఫ్ పి ఓలపై ఏపిమాస్ నిర్వహించిన జాతీయ సమ్మేళనంలో భాగంగా 'ఎస్‌హెచ్‌జీ ఉద్యమ సుస్థిరత, పురోగతి–మహిళల స్వరాలు' అనే అంశంపై జరిగిన సర్వప్రతినిధి (ప్లీనరీ) సదస్సులో భారతదేశం నలుమూలల నుంచి వచ్చిన ఎస్‌హెచ్‌జీ సమాఖ్యల మహిళా ప్రతినిధులు తమ ప్రేరణాత్మక అనుభవాలను పంచుకున్నారు. స్థానిక సాంప్రదాయిక వ్యాపార కార్యకలాపాలు, క్యాంటీన్లు, దాల్ మిల్లులు, సేంద్రియ పదార్థాల కేంద్రాలు, హస్తకళా యూనిట్లు, బొమ్మల క్లస్టర్లు, వీధి వ్యాపారుల సంఘాలు మొదలైనవి ఎలా జీవనోపాధులను మారుస్తున్నాయో, ఎస్‌హెచ్‌జీ సంస్థలను ఎలా బలోపేతం చేస్తున్నాయో నాయక మహిళలు వివరించారు. విజయవంతమైన వ్యాపారాలకు బలమైన యాజమాన్య భావన, సమర్థవంతమైన మార్కెటింగ్, ఆర్థిక క్రమశిక్షణ, సమాఖ్యల మద్దతు కీలకమని ఈ సదస్సు స్పష్టం చేసింది.

అంతర్గత మార్కెట్ల ఏర్పాటు, వ్యవస్థీకృత రుణ సహాయం, నిరంతర సామర్థ్యాభివృద్ధి ద్వారా మాత్రమే దీర్ఘకాలిక స్థిరత్వం సాధ్యమని వక్తలు నొక్కిచెప్పారు. డిజిటల్ మార్కెటింగ్, సమూహంగా కొనుగోళ్లు చేయడం, రీసైక్లింగ్, సేంద్రియ ఉత్పత్తి వంటి ఉత్తమ పద్ధతులు విస్తరించదగిన ఆదర్శ నమూనాలుగా ప్రదర్శితమయ్యాయి. మహిళల ఆధ్వర్యంలోని సమాఖ్యలను మౌలిక వసతులు, మార్కెట్ లభ్యత, ప్రామాణిక కార్యాచరణ విధానాలు (ఎస్ఓపీలు), నైపుణ్యాభివృద్ధి ద్వారా శక్తివంతం చేయడంలో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు సౌలభ్య పాత్ర పోషించాలని సదస్సు పేర్కొన్నది.

విజయవంతమైన నమూనాలను విస్తృతంగా అమలు చేయాలని, విధానపరమైన వ్యవస్థలను బలోపేతం చేయాలని, బాధ్యతాయుతమైన రుణ నిర్వహణను ప్రోత్సహించాలని, ఎస్‌హెచ్‌జీలలో, సమాఖ్యల్లో స్వయంశక్తితో కూడిన మహిళా నాయకత్వాన్ని మరింత పెంపొందించాలని పిలుపునిస్తూ ఈ సదస్సు ముగిసింది.

**ప్లీనరీ సమావేశం – ప్రధాన ఫలితాలు**

- వివిధ రాష్ట్రాల మహిళా నాయకులు దీదీ కి రసోయి, మహిళా శక్తి కాంటీన్, బయో రిసోర్స్ సెంటర్లు, దాల్ మిల్లు, విదూర్ అవుట్‌లెట్లు, హస్తకళల యూనిట్లు, వీధి విక్రేతల కార్యక్రమాలు, చెక్క బొమ్మల క్లస్టర్ల వంటి విజయవంతమైన మోడళ్లను ప్రదర్శించారు.
- సామర్థ్యం పెంపుదల (కెపాసిటీ బిల్డింగ్) , మార్కెట్ లింకేజీలు కల్పిస్తే ఎస్‌హెచ్‌జిలు మంచి లాభాలతో వ్యాపారాలు నిర్వహించగలవని నిరూపించారు.
- వ్యాపారాలు విస్తరించడానికి ముందే స్థిరపడేందుకు ఎస్‌హెచ్‌జిలు, సిఎల్ఎఫ్‌లు బలమైన అంతర్గత మార్కెట్లు తోడ్పడ్డాయి.
- ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి డిజిటల్ మార్కెటింగ్ వేదికలు ప్రభావవంతమైన అమ్మకపు మార్గాలుగా గుర్తించబడ్డాయి (ఉదా: మిజోరం చేనేత, హస్తకళలు)
- క్రమంతప్పకుండా సమాఖ్యల సమావేశాల నిర్వహణఇ, వ్యాపార సమీక్షలు బాధ్యతాయుత వ్యవహారాలను మెరుగుపరిచాయి.
- అనేక ఎస్‌హెచ్‌జిలు బ్యాంకులనుంచి, ఎన్‌బిఎఫ్‌సిల నుంచి రుణాలు తీసుకుంటున్నాయి, కానీ రుణాల తిరిగి చెల్లింపులతీరు మెరుగుపడవలసిన అవసరం ఉంది.
- వీధి విక్రేతల కోసం అమలు చేసిన దశలవారీ రుణ వ్యవస్థ , నిరంతర మద్దతు వ్యాపారాభివృద్ధిని మరింత పెంపొందిస్తుందని నిరూపితమైంది.
- వ్యాపారాల యాజమాన్యం ఎస్‌హెచ్‌జి మహిళలదై ఉండాలని, యోచన, నిర్వహణ, నియంత్రణ అన్నింటిలోనూ వారే నాయకత్వం వహించాలని

వక్తలు నొక్కి చెప్పారు.

- బాహ్య నిధుల కోసం ఎదురుచూడకుండా సభ్యులు స్వయంగా బాధ్యత తీసుకున్న చోట వ్యాపారాలు విజయవంతమయ్యాయి.
- బయో రిసోర్స్ సెంటర్లు , భూసార పరిరక్షణ, సేంద్రియ వినియోగం, పంచగవ్య, జీవామృతం, వ్యర్థాల నుండి సంపద (వేస్ట్ టు వెల్త్) వంటి పర్యావరణానుకూల విధానాలు ఉత్పత్తుల ప్రాముఖ్యతను హైలైట్ చేశాయి.
- ప్రభుత్వ పథకాలు అనేకం ఉన్నప్పటికీ అవగాహన లోపం, విధానాల క్లిష్టత, సామర్థ్య లోటు కారణంగా ఎస్‌హెచ్‌జి లు వాటిని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నాయి.

**సమగ్ర మార్పుకు సమాఖ్యల ప్రేరణ**

ఈ శీర్షికన నిర్వహించిన సమాంతర సదస్సు ఎస్‌హెచ్‌జి సమాఖ్యలు కేవలం సూక్ష్మ ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం కాకుండా, సమగ్ర సమాజ మార్పుకు శక్తివంతమైన ప్రేరక శక్తులుగా ఎదుగుతున్నాయని నిర్ధారించింది. వారి పాత్ర ఇప్పుడు నాయకత్వ వికాసం, సామాజికాభివృద్ధి, ఆరోగ్యం , మంచి పోషణ, పారిశుధ్య నిర్వహణలో మార్పు, వ్యాపార ప్రోత్సాహం వంటి వివిధరంగాలకు విస్తరించింది. ఆర్థిక, సామాజిక లక్ష్యాలను సమన్వయం చేయడం ద్వారా, మహిళలు, యువత, రైతులు, నిరుపేద కుటుంబాల సుస్థిరాభివృద్ధిని, సంక్షేమాన్ని సమాఖ్యలు బలోపేతం చేస్తున్నాయి.

ముందుకు సాగేందుకు విధాన పరంగా గుర్తింపు, వనరుల మద్దతు, సంస్థాగత బలోపేతం అత్యవసరమని చర్చలో పాల్గొన్నవారు ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. కేవలం పొదుపులు, అప్పుల నిర్వహణ నుంచి సమాజ ఆర్థిక ప్రయోజనాల వైపు దృష్టి సారిస్తూ, ఎస్‌హెచ్‌జి సమాఖ్యలు భారతదేశ మానవాభివృద్ధి పురోగతికి, పేదరిక నిర్మూలనకు గణనీయమైనరీతిలో దోహదపడే స్థితిలో ఉన్నాయి.

**సమాంతర సదస్సు-1: ముఖ్య ఫలితాంశాలు**

- ఎస్‌హెచ్‌జి సమాఖ్యలు ఇప్పుడు కేవలం రుణ కార్యకలాపాలతోనే పరిమితం కాకుండా, కుటుంబాల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక సంక్షేమం వైపు దృష్టి సారిస్తున్నాయి.
- సిఎల్ఎఫ్ లలో క్రమం తప్పని ఎన్నికలు, నాయకత్వ మార్పిడి (రొటేషన్), శిక్షణల ద్వారా నాయకత్వ నైపుణ్యాలు బలపడుతున్నాయి. దీనివల్ల పాలనా వ్యవస్థ మెరుగవుతుండటంతో పాటు రుణాల చెల్లింపులో క్రమశిక్షణ పెరుగుతోంది.
- ఇమ్యూనైజేషన్, సురక్షిత ప్రసవాలు, కిశోర బాల బాలికల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, వృద్ధుల సంరక్షణ, పారిశుధ్యం, సుపోషణ పట్ల అవగాహన వంటి సామాజిక కార్యక్రమాలకు సమాఖ్యలు విజయవంతంగా నాయకత్వం వహిస్తున్నాయి.
- ముఖ్యంగా గిరిజన , వలస కార్మిక ప్రాంతాల్లో మహిళా సంఘాలు మరుగుదొడ్ల వినియోగం, చెత్త వేర్పాటు, కిచెన్ గార్డెన్లు, పుట్టగొడుగుల సాగు, మెరుగైన పోషణ వంటి మంచి ఆచరణ పద్ధతులను ప్రోత్సహిస్తున్నాయి.
- చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు సభ్యులకు సమాఖ్యలు సహకారం అందిస్తున్నాయి. విలువ పెంపు (వాల్యూ ఎడిషన్), బ్రాండింగ్, సర్టిఫికేషన్, మార్కెట్ అనుసంధానాలకు మద్దతు ఇస్తున్నాయి.
- ఉత్పత్తుల సమూహిక సేకరణ, కొనుగోలు, విక్రయాల సభ్యులకు మంచి ధరలు, మెరుగైన నాణ్యత, బలమైన మార్కెట్ లభిస్తోంది.
- బీహార్, మేఘాలయ, అస్సాం వంటి రాష్ట్రాలు ఆరోగ్యం, విద్య, సామాజిక భాగస్వామ్య రంగాల్లో విజయ వంతమైన నమూనాలను ఇతర రాష్ట్రాలతో పంచుకొని ఉపయుక్తమైన నైపుణ్యాలను అందించాయి.

**సమాంతర సదస్సు-2**

'సభ్యుల అధిక రుణభారం సమస్య పరిష్కారంలో సమాఖ్యల కీలక పాత్ర' అనే సమాంతర సదస్సు ఎస్‌హెచ్‌జి కుటుంబాల్లో నానాటికి రుణభారం పెరుగుతుండడాన్ని తీవ్రమైన ముప్పుగా గుర్తించింది. నిలకడ లేని ఆదాయాలు, రుణాల మంజూరులో జాప్యం, రుణ

అంచనా వ్యవస్థలలో లోపాలు, యంఎఫ్ఐలు ప్రైవేటు వడ్డీ వ్యాపారాల వేగవంతమైన విస్తరణ మొదలైనవన్నీ ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా పలువురు వక్తలు పేర్కొన్నారు.

- ఎస్‌హెచ్‌జిల ప్రధాన బలాలైన నిర్ణీత సమావేశాలు, క్రమశిక్షణ, పరస్పర పర్యవేక్షణ అనేవి అధిక రుణ భారాన్ని నివారించే అత్యంత ప్రభావవంతమైన రక్షణగా కొనసాగుతున్నప్పటికీ, ఈ వ్యవస్థలు క్రమంగా బలహీనపడుతున్నాయని వక్తలు హెచ్చరించారు.
- సమాఖ్యలు కేవలం నిధుల విడుదలకే పరిమితమవకుండా, ముప్పుల నివారణ వ్యవస్థలుగా మరింత కీలకమైన పాత్రను పోషించాలని సూచించారు. ఇందుకోసం రుణ క్రమశిక్షణను కఠినంగా అమలు చేయడం, ఆర్థిక అవగాహనను పెంపొందించడం, రుణ వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేయడం, ముఖ్యమైన రుణాలన్నింటినీ లాభదాయక జీవనోపాధి ప్రణాళికలతో అనుసంధానం చేయడం అవసరమని స్పష్టం చేశారు.
- సంస్థలు పటిష్ఠంగా ఏర్పడిన తరువాతే రుణం అందాలని, రుణం సంస్థలకు ప్రత్యామ్నాయం కాదని ఈ సదస్సు స్పష్టంచేసింది.
- స్థిరమైన జీవనోపాధులు, సకాలంలో సేవల అందుబాటు, బాధ్యతాయుతమైన ఆర్థిక ప్రవర్తనే అధిక రుణభారాన్ని అడ్డుకునే మూలసూత్రమని ఈ సమాంతర సదస్సు పునరుద్ఘాటించింది.

**సమాంతర సదస్సు–2 : ప్రధాన ఫలితాలు**

- అప్పు లభిస్తున్నది కదా అని, ఎస్‌హెచ్‌జిలు, యంఎఫ్ఐలు , బ్యాంకులు , ప్రైవేటు వడ్డీ వ్యాపారులు యిలా ఎక్కడ దొరికితే అక్కడ పదేపదే అప్పు తీసుకుంటుండడమే అధిక రుణ భారానికి ప్రధాన కారణమనే స్పష్టమైన అవగాహన ఏర్పడింది.
- ఎస్‌హెచ్‌జిలలో రుణ పరిమాణాలు తక్కువగా ఉండటం, రుణాల పంపిణీ ఆలస్యం కావడం వల్ల సభ్యులు అధిక వడ్డీ గుంజే ప్రైవేటు వడ్డీ వ్యాపారుల రుణాలపై ఆధారపడాల్సి వస్తోంది.
- బలహీనమైన కేవైసీ ప్రక్రియలు, సరైన క్రెడిట్ అంచనా లేకపోవడం, రుణ వినియోగంపై పర్యవేక్షణ లోపించడంతో నియంత్రణలేని అప్పులు పెరుగుతున్నాయి.
- ఎస్‌హెచ్‌జి, విఓ, ఫెడరేషన్ స్థాయిల్లో పాలన (గవర్నెన్స్) డాక్యుమెంటేషన్ లోపాలు రుణ క్రమశిక్షణను బలహీనపరుస్తున్నాయి.
- ఎస్‌హెచ్‌జిలలో, సమాఖ్యలలో ఆర్థిక అక్షరాస్యత (ఫైనాన్షియల్ లిటరసీ) ఒక నిర్ణీత సంస్థాగత కార్యక్రమంగా అమలు కావడం లేదు.
- రుణాలను కుటుంబ అవసరాలకు, వినియోగించకుండా జీవనోపాధి ప్రణాళికలకు అనుసంధానించాలనే అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది.
- సమాఖ్యలు కేవలం మూలధనం అందించే సంస్థలుగా కాకుండా, వ్యవస్థ బలోపేతం, పర్యవేక్షణ క్రెడిట్–ప్రమాద నిర్వహణలో నాయకత్వం వహించాలనే అంశానికి బలమైన అంగీకారం వ్యక్తమైంది.

**ముఖ్య విధాన సిఫార్సులు**

- సమాఖ్యలు, ఎఫ్‌పీఓలు తమ వ్యాపార కార్యకలాపాలను వృత్తిపరంగా నిర్వహించేందుకు ప్రామాణిక ఎస్ ఓ పీలు, టెంప్లేట్లు , కాంప్లయన్స్ వ్యవస్థలను అభివృద్ధి చేయాలి.
- పనితీరుతో అనుసంధానమైన దశలవారీ రుణ మోడళ్లను ప్రవేశపెట్టాలి. కేవైసీ, క్రెడిట్ బ్యూరో తనిఖీలు, బాధ్యతాయుత రుణ విధానాల ద్వారా రుణ నిర్వహణను బలోపేతం చేయాలి.
- ఎస్‌హెచ్‌జి, వి.ఓ,సమాఖ్య స్థాయిల్లో ఆర్థిక అక్షరాస్యతను తప్పనిసరి చేయాలి. దీనితోపాటు రుణ నిర్వహణపై సలహాలు, సూచనలు అందించాలి.
- ఎస్‌హెచ్‌జిలు, సిఎల్ఎఫ్‌లు, సమాఖ్యలు, ఎఫ్‌పిఓలలో నాయకత్వ మార్పు, నిరంతర సామర్థ్యాభివృద్ధి , నిర్వహణ మెరుగుదల విధానాలను సంస్థాగతం చేయాలి.

నీ శక్తి సామర్థ్యాలను అనుమానిస్తే బాధపడకూడదు, ఎందుకంటె బంగారం నాణ్యతను శంకిస్తారు కాని ఇనుమును కాదుగా!

- ఆరోగ్యం, పోషణ, సామాజిక సమానత్వం, ప్రవర్తనా మార్పు వంటి సామాజిక అభివృద్ధి సూచీలను సమాఖ్యల, సిఎల్ఎఫ్‌ల పనితీరు పర్యవేక్షణతో అనుసంధానించాలి.
- ఆరోగ్యం, పోషణ, కిశోర సంరక్షణ, సామాజిక రక్షణ సేవల కోసం సమాఖ్యలను కడదాకా మద్దతు అందించే వేదికలుగా బలోపేతం చేయాలి.
- మహిళల నాయకత్వంలోని వ్యాపారాలను ప్రోత్సహిస్తూ, వారికి రుణ ప్రాప్తి, మౌలిక సదుపాయాలు, బ్రాండింగ్ పాలనా సంస్థలలో ప్రతినిధిత్వాన్ని నిర్ధారించాలి.
- పర్యావరణానికి అనుకూలమైన జీవనోపాధులను (సేంద్రియ ఇన్‌పుట్లు, వ్యర్థ నిర్వహణ, రీసైక్లింగ్, గ్రీన్ ఎంటర్‌ప్రైజ్‌లు) ప్రోత్సహించేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను అందించాలి.
- సమాఖ్యలకు, ఎఫ్‌పీఓలకు సరళమైన నియమావళి, సులభమైన నమోదు, బ్రాండింగ్, సర్టిఫికేషన్ , డిజిటల్ మార్కెట్ లభ్యతలను కల్పించాలి.
- సేకరణ, ఉమ్మడి ప్రాసెసింగ్ కేంద్రాలు, నిల్వ సదుపాయాలను, రవాణా వ్యవస్థలు బలోపేతం చేసి, మెరుగైన మార్కెట్ ధరల కోసం ఎస్‌హెచ్‌జి– ఎఫ్‌పీఓ సమన్వయాన్ని సాధించాలి.
- అత్యంత పేద కుటుంబాలకు అనువైన నిధులు, అనుకూల జీవనోపాధుల గురించిన అవగాహన కల్పించాలి.
- అత్యంత పేద, అసహాయ వర్గాల జీవనోపాధి, సామాజిక రక్షణ, ఆర్థిక భద్రత కోసం అనువైన ప్రభుత్వ పథకాలతో సమన్వయ పరచాలి.
- అన్ని స్థాయిల్లో ఆర్థిక పాలన పారదర్శకంగా ఉండేలా క్రమం తప్పని ఆడిట్లు, బలమైన పర్యవేక్షణ వ్యవస్థలను సంస్థాగతం చేయాలి.
- డిజిటల్ ఆర్థిక నిర్వహణను బలోపేతం చేయడం కోసం డిజిటల్ సిఆర్‌పిలు, బ్యాంకింగ్ నిపుణుల ద్వారా డిజిటల్ సేవా నమూనాలను సంస్థాగతం చేయాలి.
- సమాఖ్యల ఆర్థిక సుస్థిరత్వం కోసం డిజిటల్ బుక్‌కీపింగ్ టూల్స్, యంఐఎస్ అనుసంధానం, డ్యాష్‌బోర్డులు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను తప్పనిసరి చేయాలి.
- బహుళ రుణాలను నివారించేందుకు, ఎస్‌హెచ్‌జి సభ్యుల చెల్లింపు తీరు పర్యవేక్షణ కోసం గ్రామీణ క్రెడిట్ రిజిస్ట్రీని ఏర్పాటు చేయాలి.
- ఎఫ్ పీ ఓ లను యం ఎస్ యం ఇ లు గా గుర్తించి, ప్రభుత్వ కొనుగోలు ప్రయోజనాలకు అవకాశం కల్పించాలి. యం ఎస్ పి వద్ద నేరుగా ప్రభుత్వ కొనుగోళ్లకు మద్దతు ఇవ్వాలి.
- రాష్ట్రాల మధ్య పరస్పర అభ్యసన వ్యవస్థలు, ఎక్స్‌పోజర్ విజిట్లు, పీర్ ఎక్స్చేంజీలు , విజయవంతమైన నమూనాల ప్రచారం జరిగేలా చూడాలి.

■

## అంధ బాలల కోసం బ్రెయిలీ లెర్నింగ్ అసిస్టెంట్

**దృ**ష్టి లోపం ఉన్నవారికి బ్రెయిలీ లిపి ఓ వరం. ఈ లిపిని బోధించే అధ్యాపకులు విద్యార్థులకు అన్నివేళలా దగ్గరే ఉండి బోధించడం సాధ్యం కాదు. ప్రత్యేక పాఠశాలలు లేని ప్రాంతాల్లో చదువుకోవాలన్న అభిలాష ఉన్న చిన్నారులకు మరీ కష్టం. ఈ సమస్యను పరిష్కరించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మహ్మద్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ బ్రెయిలీ లెర్నింగ్ అసిస్టెంట్ పేరిట సరికొత్త పరికరాన్ని అభివృద్ధి చేశారు. కంటి చూపు లేని బాలలు గురువు సహాయం లేకుండా స్వయంగా బ్రెయిలీ నేర్చుకునేలా దీనిని తీర్చిదిద్దారు.

ఈ పరికరంలో 3 బై 2 ఆకారంలో గుల్లగా ఉన్న బ్రెయిలీ సెల్ ఉంటుంది. ఇందులోని సెన్సర్లు విద్యార్థి ఉంచిన డాట్స్‌ను కచ్చితంగా గుర్తిస్తాయని, ఆ ప్యాట్రన్‌ను సిస్టమ్ డీకోడ్ చేసి సంబంధిత అక్షరం, సంఖ్య లేదా సూచనను ఆడియో రూపంలో విద్యార్థులకు వినిపిస్తుందని వివరించారు. తద్వారా వారు బ్రెయిలీని స్వయంగా నేర్చుకోవడం సులభమవుతుందన్నారు. గురువుల మీద ఆధారపడే అవసరాన్ని ఈ పరికరం గణనీయంగా తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచుతుందని తెలిపారు. ■

# సమగ్ర మామిడి మార్కెటింగ్ ప్రణాళిక అవసరం: సి ఎస్

– డా. భార్గవి

పీలేరు ప్రాంతానికి చెందిన మామిడి క్లస్టర్ రైతుల కోసం ఏపిమాస్ ఆధ్వర్యంలో రానున్న మామిడి సీజన్‌కు సంబంధించి మామిడి మార్కెటింగ్‌పై ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని పీలేరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్. రెడ్డి , పీలేరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీ రామమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కార్యక్రమంలో శ్రీ సి.ఎస్. రెడ్డి ప్రసంగిస్తూ, మామిడి సీజన్ నేపథ్యంలో, ఎఫ్ పి ఓల ద్వారా సమగ్రమైన మార్కెటింగ్ ప్రణాళికను ముందస్తుగా సిద్ధం చేసుకోవడం అత్యంత అవసరం అని సూచించారు. రైతుల ఉత్పత్తులను మెరుగైన ధరలకు మార్కెట్లోకి తీసుకెళ్లడానికి సంస్థాగతంగా, శాస్త్రీయంగా, సమన్వయంగా పనిచేయాలని అన్నారు. ఉద్యానశాఖ కూడా సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణలు, ఉత్తమ పద్ధతుల అమల్లో రైతులకు అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు.

ఈ సందర్భంగా రైతులు గత సంవత్సరం మామిడి మార్కెటింగ్‌లో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకున్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు అమలు చేయడం వల్ల పంటలో మంచి నాణ్యత, అధిక దిగుబడి సాధ్యమైందని చెప్పారు. ఎఫ్‌పిఓల ద్వారా మార్కెటింగ్ చేయడం రైతులకు సౌకర్యవంతంగా లాభదాయకంగా ఉందని అభిప్రాయపడ్డారు.

తదుపరి పీలేరు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీ రామమూర్తి మాట్లాడుతూ, పీలేరు మార్కెట్‌యార్డ్‌లో రైతు బజారు సౌకర్యాలను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

రాబోయే మామిడి సీజన్‌లో పీలేరు ఎఫ్‌పిఓ మార్కెట్ యార్డ్ ప్రాంగణాన్ని ఉపయోగించి మామిడి సాగుదారుల నుంచి కొనుగోళ్లు, మార్కెటింగ్ కార్యకలాపాలు చేపట్టవచ్చని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమగ్ర మార్కెటింగ్ ప్రక్రియ ద్వారా లాభాలను పెంచుకోవాలని సూచించారు.

## నైపుణ్యాభివృద్ధి సంస్థ సందర్శన

అనంతరం శ్రీ సి.ఎస్. రెడ్డి గోరంట్లపల్లిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ (స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్)ను సందర్శించి, కంప్యూటర్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యాసకులతో వారి శిక్షణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలను పరిశీలించి, శిక్షణార్థుల అభ్యాస ప్రగతి, వారి ఆశయాల గురించి ఆత్మీయంగా పలకరించి తెలుసుకున్నారు.

కంప్యూటర్ కోర్సులో చేరిన శిక్షణార్థులతోమాట్లాడుతూ, వారు నేర్చుకుంటున్న ప్రాథమిక కంప్యూటర్ ఆపరేషన్లు, డిజిటల్ డాక్యుమెంటేషన్, డిజిటల్ లిటరసీ వంటి నైపుణ్యాలు ఉద్యోగావకాశాలను పెంచడంలో ఎలా సహాయకరంగా ఉంటాయో వివరించారు. అందుబాటులో ఉన్న శిక్షణను పూర్తిగా వినియోగించుకుని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రోత్సహించారు.

టైలరింగ్ కోర్సు శిక్షణార్థులతో మాట్లాడుతున్నప్పుడు, వారు నేర్చుకుంటున్న కుట్టు పద్ధతులు, కుట్టు యంత్రాల వినియోగం, డిజైన్ తయారీ, చిన్న స్థాయి స్వయం ఉపాధి లేదా టైలరింగ్ యూనిట్ స్థాపనకు సంబంధించిన వారి ప్రణాళికల గురించి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ సాధన మార్గాలను అన్వేషించేందుకు తమ నైపుణ్యాలను మరింత పదునుపెట్టుకోవాలని ఆయన వారికి సూచించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు గ్రామీణ యువతను, ముఖ్యంగా మహిళలను, ప్రయోగాత్మకమైన, మార్కెట్‌కు అనుకూలమైన నైపుణ్యాలతో శక్తివంతం చేయడంలో ఎంతో ముఖ్యమైనవని ఆయన పేర్కొన్నారు. ■

తమ సమస్యలను నీతో పంచుకునే వారిని చిన్నచూపు చూడకు : నీకు చెప్పడం వారు అసమర్థులై కాదు, నీమీద నమ్మకంతో

# మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన సదస్సులు

– ఆర్. లక్ష్మీదేవి

ఏపిమాస్ వాష్ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలలో నాలుగు అవగాహన సదస్సులను నిర్వహించారు. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో, విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామంలో, యాడికి మండలం యాడికిలో, కదిరి మండలం కదిరిలో ఈ అవగాహన సదస్సులను నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏపిఎంలు, సిసిలు, టిఎంసిలు, విఓఏలు, ఆర్పిలు, మహిళా సభ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత వివిధ జిల్లా అధికారుల సహకారంతో జిల్లా కోఆర్డినేటర్ ఆర్. లక్ష్మీదేవి నిర్వహించారు.

“మారుతున్న ప్రపంచంలో పారిశుధ్యం” అనే శీర్షికతో ఈ సంవత్సరం మరుగుదొడ్ల దినోత్సవాన్ని ప్రపంచం అంతటా జరుపుకున్నారు. ఈ సందర్భంగా, వాష్ కార్య క్రమంలో భాగంగా జరిగిన మరుగుదొడ్ల నిర్వహణ అవగాహన కార్యక్రమాలలో ఈ సంవత్సరపు శీర్షిక ఉద్దేశాన్ని వివరించడం జరిగింది. ఇంతేకాకుండా, ఆరు బయట మల, మూత్ర విసర్జన వల్ల కలిగే అనర్థాల గురించి, అనారోగ్య సమస్యలు, మరుగుదొడ్ల ఉపయోగం వల్ల ప్రయోజనాల గురించి, మరుగుదొడ్లను ఉపయోగించే టప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి (చెప్పులు వేసుకోవడం, చేతులు కడుక్కోవడం) వివరించడమైనది.




మరుగుదొడ్ల వినియోగాన్ని పెంచడం, మరుగుదొడ్ల వసతి లేని వారిని ఆ వసతి కల్పించుకునే విధంగా ప్రోత్సహించడం, వాడకంలో లేని, ఉపయోగించడానికి అనుకూలంగా లేని మరుగుదొడ్ల మరమ్మతులు చేయించుకోవడానికి సెర్ప్, మెప్మా ద్వారా మహిళా సంఘ సభ్యులకు రుణ సదుపాయం కల్పించే అవకాశాల గురించి వివరించడం జరిగింది.




మరుగుదొడ్ల వినియోగం పెంచడంకోసం ప్రతి మహిళా సంఘ సమావేశాలలో దీనిని చర్చించాలని, ఈ విషయమై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని ఆరుబయట మలమూత్ర విసర్జనను సమూలంగా నిర్మూలించేవరకు ఒక ఉద్యమంగా చేపట్టాలని సదస్సులలో తీర్మానించడం జరిగింది. ■

మంచితనం అంటే అందరినీ సంతోషపెట్టడం అనికాదు, అది అసాధ్యం ; ఎవరినీ నొప్పించకుండా వుండడమే మంచితనం

# ఏపిమాస్‌కు 'హ్యాట్రిక్' 'వాష్ అవార్డ్' !

– కె. శ్రీనివాస్




**వా**టర్.ఆర్గ్, సాధన్ సంస్థలు సంయుక్తంగా 2025వ సంవత్సరానికి గాను ప్రకటించిన అవార్డులలో ఏపిమాస్ అమలు చేస్తున్న వాష్ ప్రాజెక్ట్‌కు బహుమతి లభించింది.

ప్రతి సంవత్సరమూ వాటర్.ఆర్గ్, సాధన్ సంస్థలు సంయుక్తంగా నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్)కు సంబంధించిన వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్న వివిధ సంస్థల్లో విశేష ప్రతిభ కనపరచిన సంస్థలకు అవార్డులను ప్రకటిస్తారు.

అటువంటి పోటీకోసం ఏపిమాస్ అమలు చేస్తున్న వాష్ ప్రాజెక్ట్ బృందం ఈ సంవత్సరం కూడా దరఖాస్తు చేసి, పోటీలో నిలిచింది. వాష్ అంశాల కోసం ఆర్థిక వనరులను సమకూర్చడంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన స్వయంసహాయ ప్రోత్సాహక సంస్థల కేటగిరీలో 2025వ సంవత్సరానికి ఏపిమాస్‌కు వరుసగా మూడవసారి ఈ పురస్కారం లభించింది.

ఈ అవార్డును నవంబర్ 13వ తేదీన డిల్లీలో జరిగిన జాతీయ సమ్మేళనంలో అందజేశారు.

ఈ అవార్డును వాటర్.ఆర్గ్ సి ఇ ఓ శ్రీ మనోజ్ గలాటి, సాధన్ సంస్థ సి ఇ ఓ శ్రీ జిజీ మమ్మేన్ చేతుల మీదగా ఏపిమాస్ వాష్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ శ్రీనివాస్ అందుకున్నారు.

అనంతరం ఆయన ప్రాజెక్ట్ అమలులో తగిన సలహాలు, సూచనలను అందజేస్తున్న ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డిగారికి, ప్రాజెక్ట్ కార్యకలాపాలను సమర్ధవంతంగా ముందుకు తీసుకువెళుతున్న బృందానికి, పనితీరును గుర్తించి వరుసగా మూడవ సంవత్సరం కూడా అవార్డు కోసం ఎంపిక చేసిన వాటర్.ఆర్గ్, సాధన్ సంస్థలకు కృతజ్ఞతలు తెలియ జేశారు.

ఈ స్ఫూర్తితో తమ బృందం వాష్ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం అయిన లబ్ధిదారుల ప్రవర్తనలో మార్పు కోసం మరింతగా పాటు పడుతుందని శ్రీ శ్రీనివాస్ చెప్పారు. ■

ఆశ లేని చోట ఆందోళనే లేదు, అంతా ప్రశాంతమే !

# నలుగురు మహిళామణులకు రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు !

**వి**విధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, సమాజ హితం కోసం కృషి చేసిన ప్రముఖులను గౌరవించేందుకు ఉద్దేశించిన 'రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల' ప్రదానోత్సవం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ వంటి రాజకీయ, న్యాయ దిగ్గజాలు హాజరై, విజేతలకు పురస్కారాలు అందజేశారు. అవార్డు గ్రహీతలకు రూ. 5 లక్షల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. సమాజ హితమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రతిభావంతులను గుర్తించడమే ఈ అవార్డుల ముఖ్యోద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

మొత్తం ఏడుగురికి ఈ అవార్డులు లభించగా, వారిలో నలుగురు మహిళలు. వారు గాలి మాధవిలత, పల్లవి ఘోష్, ఆమ్లారూయా, సత్తుపతి ప్రసన్నశ్రీ. మిగిలిన నలుగురు:



**శ్రీకాంత్ బొల్లా :** యూత్ ఐకాన్ కేటగిరీలో గుర్తింపు పొందారు. యువతకు ప్రేరణగా నిలిచి, విద్య, ఉపాధి రంగాల్లో కొత్త మార్గాలను సృష్టించారు.



**ఆకాశ్ టాండన్:** మానవసేవా రంగంలో అసామాన్యమైన కృషి చేసినందుకునాయనకు ఈ గౌరవం లభించింది. అనహాయులకు, అనాథలకు అందించిన సేవలు అపూర్వమైనవి.



**జైదీప్ హార్దికర్:** జర్నలిజం రంగంలో సత్యసంధత, నిర్మలతతో పని చేసినందుకు గుర్తింపు. సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారు.

**గాలి మాధవీలత**

గాలి మాధవీలత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్. ఆమె జియోసింథసిస్, ఎర్త్ క్వేక్ మేనేజిమెంటు, రాక్ ఇంజనీరింగ్‌లో విశేష



సేవలనందిస్తున్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంస్థ సూచనల మేరకు చీనాబ్ వంతెన డిజైన్ ప్రొవైడర్‌గా సివిల్ ఇంజనీర్ ప్రొఫెసర్ మాధవీలతను నియమించారు. ఒక తెలుగు మహిళకు భారత అత్యున్నత ప్రాజెక్టు నిర్మాణంలో అవకాశం రావడం గర్వించదగ్గ విషయం.

ఆమె ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని ఏడుగుండ్లపాడులో అన్నపూర్ణమ్మ, వెంకారెడ్డి దంపతులకు జన్మించారు. వారి కుటుంబం వ్యవసాయం చేయడానికి కందుకూరుకు వలస వచ్చారు. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ దాకా కందుకూరులోనే చదివారు. కాకినాడలోని జేఎన్‌టీయూలో బీటెక్‌ను పూర్తి చేశారు. వరంగల్‌లోని నిట్‌లో ఎంటెక్ చదివారు. ఐఐటీ మద్రాసులో చేసిన పరిశోధనకుగాను పీహెచ్‌డీ వచ్చింది. గౌహతిలోని ఐఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. కొన్నాళ్లకు బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 14 ఏళ్ళుగా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ద్వారానే జియోసెల్స్‌ను రూపొందించారు. సాయిల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పైనా, భూకంపాలను గుర్తించే విధానంపై

పరిశోధనలు చేస్తున్నారు. ఆమె ఎన్నో పరిశోధనాపత్రాలను ప్రచురించారు. మాధవీలత భర్త సివిల్ ఇంజనీరు. వీరికి ఇద్దరు పిల్లలు.

**చీనాబ్ బ్రిడ్జి డిజైన్ కు అరుదైన అవకాశం**

బ్రిడ్జి డిజైన్‌లో పాలుపంచుకునేందుకు మాధవీలతకు అవకాశం రావడం వెనుక ఒక విశేషం ఉంది. ఆమె జియో పాలిమర్స్‌పై పరిశోధనలు చేశారు. జియోసెల్స్‌పై భారత్‌లో పీహెచ్‌డీ చేసిన తొలి సివిల్ ఇంజనీర్‌గా గుర్తింపు సాధించారామె. జియోసెల్స్‌ను ప్లాస్టిక్, క్లాత్, వెదురు ఉపయోగించి ప్రయోగాత్మకంగా రూపొందించారు. రోడ్లు, భవనాలు, భారీ నిర్మాణాలు చేపట్టే ముందు పునాదులు మరింత పటిష్టం చేసేందుకు జియోసెల్స్‌ను ఉపయోగిస్తారు. మాధవీలత ప్రయోగాత్మకంగా రూపొందించిన జియో సెల్స్‌ను ఇప్పటికే భారీ భవంతులు, బ్రిడ్జిల నిర్మాణంలో వినియోగిస్తున్నారు. వీటితో పాటు భూకంపాలను ముందుగా గుర్తించేందుకు నిరంతరంగా పరిశోధనలు చేస్తున్నారు మాధవీలత. దేశంలో జియో టెక్నాలజీపై వెలువడుతున్న ఏకైక జర్నల్‌కు మాధవీలత ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె పరిశోధనలు, ఈ రంగంలో చేస్తున్న అభివృద్ధికి గాను మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రశంసలు అందుకున్నారీ శాస్త్రవేత్త.

"రెండు భారీ కొండల మధ్య.. అత్యంత ఎత్తున నిర్మిస్తున్న చీనాబ్ బ్రిడ్జి ఆరంభం నుంచి ప్రతి అడుగూ సాహసమే" అంటారు మాధవీలత. "ఆ కొండపైకి సాధారణంగా మనుషులు చేరుకోవడమే గగనం. అలాంటిది రోడ్డు మార్గాలు నిర్మించడం అంటే మామూలు విషయం కాద'ని చెప్పారామె. బ్రిడ్జి నిర్మించే ప్రాంతంలో 220 కిలోమీటర్ల వేగంతో గాలి వీస్తుంటుంది. నిర్మాణరంగంలో పటిష్టత కోసం జియోసెల్స్ ద్వారా బ్రిడ్జికి అనుబంధమైన పిల్లర్లను నిర్మించారు.

**పల్లవి ఘోష్**

ఆధునిక ప్రపంచపు అమానుష క్రీడ "బాలికల అదృశ్యం". ఇది మహా మాయగాళ్ల అరాచకపర్వం. బాలికలను బానిసలుగా మార్చే మానవ మృగాల దుర్మార్గం.



కాలనాగుల విషవలయాన్ని ఛేదించేందుకు ప్రాణాలకు తెగించి పోరాడుతున్న ధీరవనితలు ఎందరో. అలాంటి వారిలో ముందుంటారు పల్లవి ఘోష్. బాలికలను విముక్తుల్ని చేయడంతో సరిపెట్టడం లేదు. తోడూనీడగా ఉంటున్నారు. జీవితానికి కొత్తదారి చూపుతున్నారు. అసోం రాష్ట్రం హోజోయ్ జిల్లా లుమ్డింగ్ ఈశాన్య రైల్వే ప్రధాన కేంద్రం. అక్కడే పుట్టి పెరిగారు పల్లవి ఘోష్. చిన్న వయసులో ఓ యువతి అదృశ్యం పల్లవి మనసుపై చెరగని ముద్ర వేసింది. బాలికలు, యువతుల అదృశ్యంపై వచ్చే మీడియా కథనాలు కదిలించాయి. ఢిల్లీలో గ్రాడ్యుయేషన్, చెన్నైలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. బాలికలు, యువతుల అదృశ్యాలన్నీ అపహరణలే అన్నది పల్లవి ప్రగాఢ విశ్వాసం. ఈ దురాగతాలకు పోరాటమే ఏకైక మార్గమనే నిర్ణయానికొచ్చారు. 2020 సంవత్సరంలో "ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్" స్థాపించారు.

ఐదేళ్ల పోరాటంలో ఆటుపోట్లను తట్టుకుని నిలబడ్డారు. అపహరణ ముఠాల బెదిరింపులను లెక్క చేయలేదు. గుండెల నిండా బలమైన కాంక్షతో ఆశయ సాఫల్యానికి అలుపెరగని కృషి చేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన ఐఐఎం – లఖనవూ, 2025 ఎల్పీఎస్ – ఐఐఎం అవార్డుతో సత్కరించింది. పల్లవి ఘోష్‌ను 'రామోజీ ఎక్సలెన్స్' అవార్డుతో రామోజీ గ్రూప్ సత్కరించింది.

**ఆమ్లారూయా**



ఎడారి మనుషుల తడారిన బతుకులు చలింపజేశాయి. పల్లెజనం దాహం కేకలు, వలసగాథలు ఆమ్లారూయా మనసును కదిలించాయి. అది 1999 ఫిబ్రవరి. ఓ రోజు ఆమ్లారూయా టీవీ చూస్తున్నారు. రాజస్థాన్ కరవు కథనం ఆమె మనసును మెలిపెట్టింది. పత్రికా కథనాలు, జనం వలస గాథలు

మనిషి స్వభావం మారడం కష్టం, మార్చాలనుకోవడం అవివేకం, అంతకంటె వారితో నీవు వ్యవహరించే తీరు మార్చుకో

ఆలోచనలో పడేశాయి. గ్రామీణ భారతంలో ఇంత కఠిన పరిస్థితులు ఉన్నాయా అని మథనపడ్డారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా కార్యక్షేత్రంలోకి దూకారు. ప్రయోగాత్మకంగా మాండవర్ గ్రామంలో రెండు చెక్ డ్యాములు కట్టించారు. మూడేళ్లలో సాగు బాగైంది.

తరువాత ఆశయ సాఫల్యానికి 'ఆకార్ ఛారిటబుల్ ట్రస్టు' ఏర్పాటుచేశారు. రాజస్థాన్‌తో మొదలుపెట్టి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, చత్తీస్‌గఢ్ సహా 11 రాష్ట్రాలకు జలయజ్ఞాన్ని విస్తరించారు. రెండున్నర దశాబ్దాల కృషితో 814 చెక్ డ్యాములు, 494 నీటికుంటలకు ఊపిరి పోశారు. ఆమె ఎన్నో ఊళ్ల నీటికష్టాలు తీర్చి "వాటర్ మదర్ ఆఫ్ ఇండియా"గా పేరొందారు. ఆమె సేవలకు అనేక అవార్డులు దక్కాయి. 2008 ఫిక్కీ ఎఫ్ఎల్ఓ మొదలు 2025లో జమ్నా లాల్ బజాజ్ వరకు అనేక సంస్థలతో అవార్డులతో సత్కరించాయి. ఇదేబాటలో రామోజీ గ్రూప్ 'ఎక్సలెన్స్ అవార్డు'తో అమ్లా రూయాను గౌరవించింది.



**సత్తుపతి ప్రసన్న శ్రీ**

ప్రతి మనిషిలో ఏదో ఒక నైపుణ్యం దాగిఉంటుంది. ఆ నైపుణ్యాన్ని గుర్తించి పదును పెట్టి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేవారు కొందరైతే... తమలోని ప్రతిభా పాటవాలను తమకోసమే గాక ఇతరుల అభ్యున్నతికోసం వినియోగించి ఉన్నతస్థాయి నుంచి గొప్పవారుగా ఎదిగేవారు మరికొందరు. ఈ కోవకు చెందిన వారే రామోజీ ఎక్స్ లెన్స్ పురస్కారాన్ని అందుకున్న ప్రొఫెసర్ సత్తుపతి ప్రసన్న శ్రీ. ఆమె 1964లో తెలుగు మాట్లాడే కుటుంబంలో జన్మించారు, కానీ తరువాత జీవితంలో తన సొంత గిరిజన మూలాలను కనుగొన్నారు. ఈ అవగాహన అణగారిన భాషలను, సంస్కృతులను కాపాడుకోవాలనే మక్కువను ఆమెలో రేకెత్తించింది. ఆమె ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పొందారు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేశారు. ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే గిరిజన భాషలను పరిరక్షించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. అనేక ఏళ్లపాటు గిరిజన భాషల పరిరక్షణకు ఆమె చేసిన కృషిని గుర్తించిన భారత ప్రభుత్వం సత్తుపతి ప్రసన్నను 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు 'నారీ శక్తి' అవార్డుతో సత్కరించింది.

శ్రీ ఆంధ్రా యూనివర్సిటీలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చేర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ మరో పక్క ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారామె. తన బాధ్యతలు పూర్తయ్యాక మిగతా సమయం మొత్తాన్నీ మైనారిటీ గిరిజన భాషలను సంరక్షించడానికి కేటాయించారు.

అనేక గిరిజన భాషలు అంతరించిపోయే ముప్పును గుర్తించిన ప్రసన్న శ్రీ, తన వృత్తిని వాటి డాక్యుమెంటేషన్ కు,పునరుజ్జీవానికి అంకితం చేశారు. ఆమె ఆంధ్రప్రదేశ్ అంతటా వివిధ గిరిజన వర్గాలతో కలిసి పనిచేస్తూ, వారి భాషలను, సాంస్కృతిక పద్ధతులను నిశితంగా అధ్యయనం చేస్తూ సంవత్సరాలు గడిపారు.

శ్రీకుపియా, కోయ, పోర్జా, జతపు, కొండదొర, గదబ, కోలం, గోండి, కోటియా, సవర, కుర్రు, సుగాలి, లింగువా గౌడు, ముఖధోర, రాణా భాషలకు వ్రాత వ్యవస్థలను రూపొందించారు. ఆమె 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుండి నారీ శక్తి పురస్కారాన్ని అందుకున్నారు.

**ప్రసన్న శ్రీ రచయిత్రి కూడా. ఆమె ప్రచురణలలో కొన్ని...**

- తూర్పు, పశ్చిమ దేశాల ఆధునికానంతర సాహిత్యంలో మహిళల మానసిక గతిశాస్త్రం
- నిశ్శబ్దపు ఛాయలు
- శశి దేశ్‌పాండే నవలల్లో స్త్రీ – ఒక అధ్యయనం సాహిత్యంలో మహిళల మానసిక గతిశాస్త్రం
- నిశ్శబ్దపు ఛాయలు
- శశి దేశ్‌పాండే నవలల్లో స్త్రీ – ఒక అధ్యయనం

■

ఆరడుగుల మనిషి విలువ నాలుగంగుళాల నాలుకపై ఆధారపడి వుంటుంది

# ఏపీలో డ్వాక్రా మహిళలకు 9 క్లస్టర్లతో ఉపాధి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంతో కలిసి డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలున్న రంగాలను గుర్తించి, వారికి అండగా నిలుస్తోంది. డ్వాక్రా మహిళల కోసం క్లస్టర్ల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది.. ఇప్పటికే 9 ప్రాంతాలను కేంద్రానికి నివేదించగా గుంటూరులో పచ్చళ్ల తయారీ, బాపట్ల, కర్నూలులో చేనేత క్లస్టర్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. మరో ఆరు క్లస్టర్లకు త్వరలో గ్రీన్‌సిగ్నల్ రానుంది. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని కేంద్రం సూచించింది. ఈ పథకాల ద్వారా 11,475 మంది మహిళలు లబ్ధి పొందనున్నారు. ఈ క్లస్టర్ల ఏర్పాటుకు సంబంధించి అధికారిక ఆమోదం కోసం వేచి చూడకుండా పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సూచించింది.

ఈ ప్రాజెక్టుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టనుండగా, మొత్తం 9 క్లస్టర్లకు రూ.100 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ క్లస్టర్లకు సంబంధించిన నివేదికల్ని అధికారులు కేంద్రానికి పంపించారు. చేనేత క్లస్టర్లకు సంబంధించి రూ.5కోట్ల చొప్పున.. పచ్చళ్ల తయారీ క్లస్టర్‌కు రూ.22 కోట్లు కేటాయించారు. గుంటూరు జిల్లాలో పచ్చళ్ల తయారీ క్లస్టర్‌తో 2,500 మంది డ్వాక్రా మహిళలు లబ్ధిపొందుతారని చెబుతున్నారు.

చేనేతలకు సంబంధించి చేనేత కార్మికులకు ఆధునికతను జోడించేందుకు ప్రభుత్వం క్లస్టర్ల ఏర్పాటుకు నిర్ణయించింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా చీరాల వంటి ప్రాంతాలు నేత చీరలకు ప్రసిద్ధి. ఈ క్లస్టర్ల ద్వారా చేనేత ఉత్పత్తులకు కొత్త మార్కెట్ లభిస్తుంది. విజయనగరం, మరో జిల్లాలో మిల్లెట్ (చిరుధాన్యాల) క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల స్థానిక రైతులు, చేనేత కార్మికులు ప్రయోజనం పొందుతారు.

ప్రకాశం జిల్లా కొత్తపట్నం కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. పర్యాటకులు వస్తే, హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. విజయవాడ సమీపంలోని జక్కంపూడిలో ఏర్పాటు చేయనున్న సాంకేతిక క్లస్టర్, కొత్త టెక్నాలజీలను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఆహార ఉత్పత్తుల క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. ■

## ఎడారి రాష్ట్రంలో ఉసిరి ఉపాధి !

రాజస్థాన్ అజ్‌మేర్ జిల్లాలోని పుష్కర్ ప్రాంతం ఉసిరి పంటకు ప్రసిద్ధి. సాగుతో పాటు ప్రాసెసింగ్ రెండూ రైతులే చేస్తున్నారు. స్థానిక అంచనాల ప్రకారం.. ఏటా అక్టోబరు – మార్చి సీజన్‌లో పుష్కర్‌తో పాటు సమీప గ్రామాల నుంచి రోజు దాదాపు 60–80 టన్నుల ఉసిరిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. గత రెండు దశాబ్దాల్లో 10–15 ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేశారు. క్యాండీలు, మురబ్బా, చ్యవన్‌ప్రాశ్, పౌడర్, లడ్డూలు తయారు చేస్తున్నారు. దీని ద్వారా వందలాది మందికి, ముఖ్యంగా మహిళలకు ఉపాధి లభిస్తోంది.

అనువైన నేల, వాతావరణ పరిస్థితులతో ఉసిరి సాగు ఇక్కడి రైతులకు జీవనోపాధిగా మారింది. ప్రభుత్వం సైతం ఉచితంగా ఉసిరి మొక్కలు సరఫరా చేస్తూ.. సాగును ప్రోత్సహిస్తోంది. “ఈ చెట్లు మూడేళ్లలోనే చేతికొచ్చి.. ఒక్కోటి ఏటా 150–200 కిలోల దిగుబడిని యిస్తాయి. ప్రధానంగా ఎనిమిది రకాలు ఉన్నప్పటికీ.. చకియా రకం నాణ్యతపరంగా ప్రత్యేకంగా నిలుస్తోంది. ఉసిరి ఉత్పత్తులు ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. ఫార్మా, సౌందర్య ఉత్పత్తుల తయారీ సంస్థలు తీసుకెళ్తుంటాయి” అని రైతులు తెలిపారు. ■

పాత స్నేహం బంగారం, కొత్త స్నేహం వజ్రం ; కాని పాత స్నేహితులను మరువరాదు, వజ్రమైనా బంగారంలోనే పొదగాలి కదా!

# అంధుల క్రికెట్‌లో వరల్డ్‌కప్‌ను అందించిన విజయ దీపిక !

**ఆ**కలి బాధలు తట్టుకుంది. అవమానాలను భరించింది. అంధురాలనే వెక్కిరింతలు.. హేళనలకు భయపడి ఆగిపోకుండా ముందడుగు వేసింది. కష్టాలను అధిగమించి, కన్నీళ్లను దిగమింగి తనకు ఆసక్తి ఉన్న క్రికెట్‌ను కెరీర్‌గా మార్చుకుంది. 'అంధురాలివి నీకెందుకు ఆటలు ఒక మూలన కూర్చోక' అని వెక్కిరించిన వాళ్లకు తానేంటో నిరూపించింది. దేశానికి తొలి మహిళల అంధుల వరల్డ్‌కప్‌ను అందించి సామాన్యుల నుంచి ప్రధాని నరేంద్రమోదీ వరకు అందరి ప్రసంశలను అందుకుంటున్న భారత జట్టు కెప్టెన్, రాయలసీమ అమ్మాయి దీపిక ఆంధ్రజ్యోతి 'నవ్య'తో పంచుకున్న విశేషాలు ఆంధ్రజ్యోతి సౌజన్యంతో మీకోసం...



"మాది సత్యసాయి జిల్లా, మడకశిరలోని తంబలహట్టి అనే చిన్న గ్రామం. అమ్మ చిట్టమ్మ, నాన్న తిమ్మప్ప వ్యవసాయ కూలీలు. ముగ్గురు సంతానంలో నేను పెద్దమ్మాయిని. నాకు ఇద్దరు తమ్ముళ్లు. మాకు రెండెకరాల భూమి ఉంది కానీ, నీళ్ల సదుపాయం లేక పోవడంతో సాగు చేసే అవకాశం లేక అమ్మనాన్న కూలీలుగా మారారు. నాకు ఐదు నెలలప్పుడు కంటిలో నా చేతి వేలితో పొడుచుకోవడంతో బొబ్బ వచ్చింది. అది తగ్గకపోవడంతో నాన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చూసి ఇప్పుడు సర్జరీ చేయడం కుదరదు. పదేళ్లు నిండాక శస్త్రచికిత్స చేద్దామని చెప్పారు. నా వయసుతో పాటు కుడి కంటిలో ఆ బొబ్బ కూడా పెరిగి చూపు పోయింది.

**బడిలో కలవనిచ్చేవారు కాదు..**

బడిలో నన్ను అందరితో పాటు కలవనిచ్చేవారు కాదు. ఆటలు ఆడనిచ్చే వారు కాదు. "గుడ్డిదానివి. పోయి ఒక పక్కన కూర్చో" అనేవారు. ఇంటికి వచ్చి అమ్మకు చెప్పేదాన్ని. "బాధపడకు. బాగా చదువుకో. దేవుడే నీకు దారి చూపిస్తాడు" అని అమ్మ ఓదార్చేది, ధైర్యం చెప్పేది. మా పొలంలో బోర్లు వేసేందుకు, కూలీ పనులు లేకపోవడంతో కుటుంబాన్ని పోషించేందుకు నాన్న అప్పులు చేశారు. అవి తిరిగి చెల్లించలేకపోవడంతో అప్పు ఇచ్చిన వారు మా ఇంటి పైకి వచ్చి గొడవ చేసేవారు. వారి మాటలు భరించలేక నాన్న పక్క ఊరిలో పగలంతా పని చేసేవారు. రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చి, మాకు తినడానికి రాగులు, బియ్యం ఇచ్చేవారు. మళ్లీ ఆ చీకట్లోనే వెళ్లిపోయేవారు. నాన్న ఇంటికి రాని రోజు మేము పస్తులు ఉండాల్సి వచ్చేది. మా ఊర్లో పండ్ల చెట్లు వెతుక్కొనే వాళ్లం. ఆకలి భరించలేక సగం కుళ్లిన పండ్లు కూడా తినేవాళ్లం. అన్నం వండినరోజు కూడా సరిపోక నేను, తమ్ముడు కొట్టుకొనే వాళ్లం. సరైన దుస్తులులేక చిరిగినవి, పాడైనవి వేసుకొనేవాళ్లం. పదేళ్లు నిండాక నాకు ఆపరేషన్ చేయించేందుకు నాన్న రూ. 2 లక్షలు అప్పు చేశారు. వైద్యులు సర్జరీ చేసినా చూపు వస్తుందని హామీ ఇవ్వలేమన్నారు. అప్పుడు "ఆపరేషన్ చేయించి డబ్బులు వృథా చేయొద్దు నాన్నా... నాకు ఇలా బతకడం అలవాటు అయిపోయింది" చెప్పా. ఆ మాటలకు నాన్న గుండెలు పగిలేలా రోదించారు. అంత దయనీయమైన జీవితం గడిపిన నాకు క్రికెట్ కొత్త బతుకును ఇచ్చింది.

**క్రికెట్ మలుపు తిప్పింది..**

కర్ణాటకలోని తుమ్మకూర్‌లో ఉన్న శివకుమార్ స్వామిజీ స్కూల్‌లో అంధులకు ఉచితంగా చదువు చెబుతారని తెలిసి.. అమ్మా నాన్నా నన్ను అక్కడ చేర్పించారు. స్కూల్‌లో మంచి భోజనం పెట్టి, బాగా చూసుకొనేవారు. అయితే, అన్నం తింటున్నప్పుడల్లా తమ్ముళ్లు ఏం తింటున్నారోనని గుర్తొచ్చి బాగా ఏడ్చేదాన్ని.. స్కూల్‌లో టీచర్ల ప్రోత్సాహంతో పదో తరగతి నుంచి క్రికెట్ ఆడడం ప్రారంభించా. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌కు అంధ మహిళల జట్టు ఉండేది కాదు. దాంతో కర్ణాటక జట్టు తరఫున ఆడడం ప్రారంభించా. 2019లో

ఆమోదయోగ్యం కాని అవకాశం కంటె ఇష్టమైన దాంట్లో వైఫల్యమే మేలు

జాతీయ అంధుల క్రికెట్ బోర్డు ఏర్పడిన తర్వాత మాకు ఆడేందుకు ఒక వేదిక దొరికింది.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటడంతో 2023లో జాతీయ జట్టులో స్థానం లభించింది. అదే ఏడాది బర్మింగ్‌హామ్‌లో జరిగిన అంధుల వరల్డ్ గేమ్స్‌లో క్రికెట్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో నేను సభ్యురాలిని. సమర్ధానం ట్రస్టు వారి డిగ్రీ కళాశాలలో పరిచయమైన సీనియర్ అన్న మోహన్ నన్ను బాగా ప్రోత్సహించారు. రెండేళ్లు తిరిగేసరికి నా ప్రతిభను గుర్తించి టీమిండియాకు కెప్టెన్ చేశారు. నా సారథ్యంలో భారత జట్టుకు తొలి మహిళల టీ-20 వరల్డ్‌కప్ అందించడం చాలా గర్వంగా ఉంది. ఒక మారుమూల గ్రామంలో మొదలైన నా ప్రయాణం, ఈ స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉంది.

**ప్రభుత్వం చేయూత ఇవ్వాలి..**

నేను ప్రస్తుతం ముంబైలో ఇన్‌కమ్‌టాక్స్ విభాగంలో రూ. 25 వేలకు ఉద్యోగం చేస్తున్నా. నా ఖర్చులకుకూడా ఆ డబ్బు సరిపోవడం లేదు. ఇప్పటికీ మా కుటుంబం కోసం చేసిన అప్పులను నాన్న తీరుస్తూనే ఉన్నారు. ఇన్ని కష్టాల్లో కూడా క్రికెట్ పైన ఉన్న మక్కువ, దేశంపై ఉన్న ప్రేమతో కష్టాలను దిగమింగి వరల్డ్‌కప్ సాధించా. నాలాంటి అంధ క్రికెటర్లను ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు ప్రోత్సహిస్తే మాకు జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల మరింత పెరుగుతుంది.”

*-ఎస్.ఎస్..బి.సంజయ్*

**ప్రధాని తండ్రిలా మాట్లాడారు**

ప్రధాని నరేంద్రమోదీతో గత గురువారం జరిగిన 45 నిమిషాల ఇష్టాగోష్టిలో ఆయన ఒక కుటుంబ పెద్దలా, తండ్రిలా మాట్లాడారు. మా వ్యక్తిగత నేపథ్యాలను, జీవిత విశేషాలను అడిగి తెలుసుకున్నారు. నేను పాటలు బాగా పాడతానని తెలిసి, నన్ను పాడమని అడిగారు. నేను శివుడి భక్తి గీతం ఒకటి పాడి వినిపిస్తే. బాగా పాడావని అభినందించారు. వరల్డ్‌కప్‌లో ఎదురైన సవాళ్ల గురించి, పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో మా ఆట గురించి అడిగి తెలుసుకున్నారు. మా అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ■

## కేంద్ర లేబర్ ఇన్సూరెన్స్ పథకం

**ఈ** పథకంలోకి కార్మికులు మాత్రమే చేరవచ్చని చాలామంది అనుకుంటారు. అది కానే కాదు. తెల్ల రేషన్ కార్డు కలిగి వున్న ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులే...

- ప్రభుత్వ ఉద్యోగులు తప్ప, కూలీలతో పాటు అందరు అర్హులే.
- తెల్ల రేషన్‌కార్డు తప్పని సరి.
- ఏడాదికి 22 రూపాయలు మాత్రమే.
- 5 సంవత్సరాలు ఒకేసారి చెల్లించాలి, కేవలం 110/- రూపాయలు మాత్రమే.

1) 18 నుండి 55 సంవత్సరాలు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులు.
2) ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన, ఇతరులైన ఇందులో చేరవచ్చు.
3) రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జిరాక్స్ జత చేయాలి.
4) బ్యాంకు చలానా జత చేసి లేబర్ ఆఫీస్ లో ఇవ్వాలి.

**ప్రయోజనాలు**

5) పాలసీదారు సహజమరణం పొందితే 1,30,000/-రూపాయలు ఇన్సూరెన్స్
6. అలాగే ప్రమాదవశాత్తూ మరణంవల్ల 6,00000/- రూపాయలు
7) ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు వుంటే ఒకొక్కరికి వివాహ నజరానాగా 30,000/- రూపాయలు
8) ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు 30,000/- రూపాయలు చొప్పున వచ్చే అవకాశం ఉంది.
9) 1 ఇయర్ పాలసీ పొందిన తరువాత లబ్ధిదారునికి ప్రమాదం జరిగి 50% వికలాంగులుగా ఉంటే 2.50 లక్షలు, అదే 100% ఉంటే 5 లక్షల పరిహారం పొందే అవకాశం ఉంది.

ఈ లేబర్ ఇన్సూరెన్స్ ఒకసారి 110/-రూ.చెల్లిస్తే 5 సంవత్సరాలు వరకు చెల్లించనక్కర్లేదు. ■

ప్రతీకారం తీర్చుకుంటే నీకు హాని చేసినవారితో నీవూ సమానమే , మన్నించగలిగితే వారికంటె నీవు ఎంతో అధికం

# తెలుగమ్మాయికి అంతరిక్ష యాత్ర అవకాశం!

**అం**తరిక్షంలోకి తెలుగమ్మాయి పువ్వు పట్టగానే పరిమళిస్తుందంటారు. కుంచల కైవల్యరెడ్డికి ఈ నానుడి మెరుగ్గా వర్తిస్తుంది. ఎనిమిది, పదో తరగతుల్లోనే గ్రహశకలాలను కనుగొన్న ఈ 17 ఏళ్ల అమ్మాయి, తాజాగా అంతరిక్షంలోకి అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్న తెలుగమ్మాయిగా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా కైవల్య ఆంధ్రజ్యోతి 'నవ్య'తో తన అరుదైన అవకాశ విశేషాలను పంచుకున్నారు. ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ఆ విశేషాలు మీకోసం ...



ఆకాశం వైపు చూసిన ప్రతి ఒక్కరికీ అక్కడ కనిపించే నక్షత్రాలు, చంద్రుడిని దగ్గరి నుంచి చూడాలనీ, వాటిని తాకాలని అనిపిస్తుంది. వాటి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటే, ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవలసింది మిగిలి ఉంటూనే ఉంటుంది. ఖగోళ అంశాలు అంతటి విస్తృత మైనవి. అందర్లాగే నాక్కూడా చిన్నప్పటి నుంచి ఖగోళం పట్ల ఆసక్తి ఉండేది. ఆ ఆసక్తి వయసుతో పాటు పెరిగింది. అంతరిక్షం పట్ల ఆసక్తి కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ వ్యోమగామిగా ఎదగాలని కలలు కంటారు. అలాగే నేను కూడా రెండో తరగతి చదివే వయసు నుంచే వ్యోమగామిగా ఎదగాలని కల కన్నాను. ఫ్లోరిడాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ చేపట్టబోతున్న వ్యోమ గామి శిక్షణ కోసం 36 దేశాల నుంచి వేలాదిమంది దరఖాస్తు చేసుకున్నారు. చివర్లో ఎంపికైన 150 మంది అభ్యర్థుల్లో నేనొకదాన్ని. ఎంపిక ప్రక్రియలో భాగంగా టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీ సిఇఒ ఎస్. లాచ్‌మాన్‌తో పాటు చీఫ్ ఆస్ట్రోనాట్ విలియం మెక్‌ఆర్థర్, సీవోవో అండ్ చీఫ్ ఇంజనీర్ డా.వి. విజయ్ నన్ను గంట పాటు ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేశారు. అంతరిక్షంలో అడుగుపెట్టబోయే అభ్యర్థిగా ఎంపికయ్యానని తెలిసినప్పుడు నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కల నిజమవడం గొప్ప అనుభవం.

**తల్లిదండ్రుల తోడ్పాటుతో...**

కుటుంబ తోడ్పాటు ఉన్నప్పుడు ఏ కలనైనా నిజం చేసుకోగలుగుతాం! నా విషయంలో అదే జరిగింది. ఇది కఠినమైన రంగమనీ, ఈ రంగంలో మహిళలకు అవకాశాలు కష్టమనీ అంటూ ఉంటారు. అయినా మా పేరెంట్స్ నన్ను ప్రోత్సహించారు. రెండో తరగతిలో ఉన్నప్పుడు ఒక పుస్తకం అమ్మ దగ్గరకు తీసుకువెళ్లి ఆ పుస్తకం మీద కనిపిస్తున్న వ్యక్తులెవరు? అని అడిగాను. వాళ్లు సునీతా విలియమ్స్, మిగతా వ్యోమగాములనీ, వాళ్లందరూ అంతరిక్షంలోకి వెళ్లారనీ అమ్మ చెప్పింది. ఆ మాటలు విన్న తర్వాత ఏదో ఒకనాటికి అంతరిక్షంలోకి వెళ్లాలని అప్పుడే అనుకున్నాను. అప్పటి నుంచి అంతరిక్షం గురించి నేను అడిగే ప్రశ్నలకు పేరెంట్స్ సమాధానాలు చెప్తూ, పుస్తకాలు అందిస్తూ, నా ఆసక్తిని మరింత ప్రోత్సహించారు. భవిష్యత్తులో ఆస్ట్రో ఫిజిక్స్ చదవాలన్నది నా కల. ఈ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారం నోబెల్ బహుమతి. కాబట్టి నేను కూడా రీసెర్చ్ సైంటిస్ట్‌గా ఎదిగి, నోబెల్ బహుమతిని గెలవాలని భావిస్తున్నాను.

**మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు**

టిఎస్ఎ శిక్షణ రెండేళ్ల పాటు కొనసాగుతుంది. జీరో గ్రావిటీ పారాబొలిక్ ఫ్లైట్స్‌లో భాగంగా స్కూబా డైవింగ్, స్కై డైవింగ్‌లలో శిక్షణ సాగుతుంది. మేం అంతరిక్షంలో భిన్నమైన పరిశోధనలు చేపట్టబోతున్నాం. అంతరిక్షంలో మానవశరీరం కొన్ని మార్పులకు లోనవుతుంది. ఆ సమయంలో ఎలాంటి భౌతిక, మానసిక మార్పులు చోటు చేసుకోబోతున్నాయో తెలుసుకోబోతున్నాం. 2025 నాటికి గాల్లో ఎగిరే కార్లు అందుబాటులో కొస్తాయని 1990ల్లో అనుకున్నారు. ముమ్ముందు భూగ్రహం మీద కాకుండా అంతరిక్షంలో నివసించే అవకాశాలు ఉండొచ్చని ఇప్పుడు

**మ**నమిప్పుడు ఆవిష్కరించిన అంశం భవిష్యత్తులో ఉపయోగపడవచ్చు. ఒకప్పుడు న్యూటన్ కనిపెట్టిన లాస్ ఆఫ్ ఫిజిక్స్ అద్భుతమైన ఆవిష్కరణ. కానీ అప్పటి వాళ్లకు దాని విలువ తెలియదు. కానీ ఇప్పుడు కూడా న్యూటన్ లాస్ మనకు అక్కరకొస్తున్నాయి. నేను కూడా కొన్ని శతాబ్దాల పాటు ఉపయోగించుకోగలిగే అంశాలను ఆవిష్కరించాలని కోరుకుంటున్నాను.

మా స్వస్థలం, బాపట్ల జిల్లా బేతంపూడి. నాన్న కుంచాల శ్రీనివాసరెడ్డి నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం సచివాలయంలో కార్యదర్శిగా పని చేస్తున్నారు. అమ్మ కుంచాల విజయలక్ష్మీ గృహిణి. ప్రస్తుతం, ఆస్ట్రానమీ కిడ్స్ క్లబ్ సహ వ్యవస్థాపకురాలిగా, స్పేస్‌పోర్ట్ ఇండియా ఫౌండేషన్ రాయబారిగా వ్యవహరిస్తున్నాను. జీరో గ్రావిటీ, పారాబొలిక్ ఫ్లైట్స్, స్కూబా డైవింగ్, ఈవా డైవింగ్, న్యూట్రల్ బోయన్సీ, హై-ఆల్టిట్యూడ్ స్కైడైవింగ్, ఎక్స్‌టెన్సివ్ మౌంటెన్ హైకింగ్ వంటి వాటిలో శిక్షణ పొందిన తర్వాత అభ్యర్థులందరం మా మా మిషన్ అసైన్‌మెంట్‌లను అందుకుని, అధునాత శిక్షణ దశలోకి ప్రవేశించడంతోపాటు శాస్త్రీయ ప్రయోగాలు చేపడతాం.

– కైవల్య

మనందరం అనుకుంటున్నాం. భవిష్యత్తులో అంతరిక్షంలో నివసించే అవసరం ఏర్పడ్డప్పుడు, అక్కడి పరిస్థితులకు తగ్గట్టు ఎలా అలవాటు పడాలో తెలియాలంటే అందుకు తోడ్పడే పరిశోధన సాగాలి. ఇప్పుడు నేను ఎంపికైన అంతరిక్ష యాత్ర కూడా ఆ పరిశోధనలో భాగమే!

కైవల్య విజయ పరంపర 6వ తరగతి నుంచే మొదలైంది. నాసా ఫెసిలిటీతో అలబామాలోని ఎక్సా అమెరికాలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాంను పూర్తి చేసిన అతి పిన్న వయస్కురాలైన భారతీయురాలిగా కైవల్య ఘనత సాధించింది. నాసా ఫెసిలిటీతో ఈక్స్‌ఎ నిర్వహించే అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం-2023ను 15ఏళ్ల వయసులోనే పూర్తి చేసింది. 98 దేశాలు పాల్గొనే ఖగోళ, ఖగోళ భౌతిక శాస్త్ర పోటీల్లో సిల్వర్ హానర్ సర్టిఫికెట్ పొందింది. నాసా సిటిజెన్ సైంటిస్టుగా అంగారక, బృహస్పతి గ్రహాల మధ్య ఉండే ముఖ్యమైన ఆస్టరాయిడ్ బెల్ట్‌లోని 2020 పిఎస్24, 2021 సిఎం37 అనే రెండు ప్రివిజనల్ ఆస్టరాయిడ్స్‌ని కొనుగొంది.

నాసా నిర్వహించే సైంటిస్ట్ ఫర్ ఎ డే-2021 వ్యాసరచన పోటీల్లో జాతీయ ఫైనలిస్ట్‌గా నిలిచింది. ఇస్రో నిర్వహించిన స్పేస్ క్విజ్, సైన్స్ ఫెయిర్, ఆస్ట్రో ఫొటోగ్రఫీ, వక్తృత్వంతో పాటు ఇతర పోటీల్లో అనేక అవార్డులను అందుకొంది. ■

## నిరక్షరాస్యుల కోసం ‘అక్షరాంధ్ర’

**ఆం**ధ్రప్రదేశ్‌లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ ‘అక్షరాంధ్ర’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర పథకం ‘ఉల్లాస’తో అనుసంధానం చేసుకుని, అక్షరాంధ్రను అమలుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించిన విధివిధానాలను కూడా అందులో పొందుపరిచారు.

గ్రామ వార్డు సచివాలయాల సర్వే ప్రకారం రాష్ట్రంలో 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్కులు 81లక్షల మంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. వారందరినీ అక్షరాస్యులుగా మార్చడం లక్ష్యంగా అక్షరాంధ్ర కార్యక్రమం అమలు చేస్తారు. ఏడాదికి 25 లక్షల మందికి శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా మార్చనున్నారు. వారికి మాతృభాష చదవడం, రాయడం, కూడికలు తీసివేతలు లాంటి చిన్నపాటి లెక్కలపై అవగాహన కలిగేలా వారికి ప్రాథమికాంశాలను బోధిస్తారు. అలాగే డిజిటల్, ఫైనాన్షియల్, ఆరోగ్యం, న్యాయ అంశాలపైనా అవగాహన కల్పిస్తారు. వలంటీర్లను నియమించి వారి ద్వారా వయోజనులకు బోధిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లను ఇందుకోసం వినియోగిస్తారు. ఉదయం, సాయంత్రం, వారాంతాల్లో తరగతులు నిర్వహిస్తారు. కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్లు ఇస్తారు. ■

# మంచిర్యాలలో భారత రాజ్యాంగ దినోత్సవం !

**– రాజోజుల బ్రహ్మాచారి**

**మం**చిర్యాల మునిసిపాలిటీలో మెప్మా ఆధ్వర్యంలో టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ శ్రీ దాసరి చంద్రయ్య అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని నవంబర్ 26 వ తేదీన నిర్వహించారు.

1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని, 2015 సంవత్సరం నుంచి ఆ రోజునే భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపు కుంటున్నామని వాష్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారి తెలిపారు.



ఎందుకంటే 2015లో అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా దేశ ప్రజలలో రాజ్యాంగ విలువల పట్ల అవగాహనను పెంపొందించడానికి సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించిందని చెప్పారు. రాజ్యాంగాన్ని రూపొందించేందుకు 1947లో ముసాయిదా కమిటీ ఏర్పడింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అధ్యక్షతన, ఏడుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీ రాజ్యాంగ తుది ప్రతిని రూపొందించింది. రెండు సంవత్సరాల వ్యవధిలో కమిటీ 11 సమావేశాలలో నిశితంగా చర్చలు జరిపి , వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను, అభ్యంతరాలను సైతం స్వీకరించింది. రాజ్యాంగ రచన పూర్తి కావడానికి మొత్తం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టిందని 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొందింది. ఆ తర్వాత 1950 జనవరి 26 భారత రాజ్యాంగం సంపూర్ణంగా అమలులోకి వచ్చింది అని చెప్పారు.

395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్ళు, 22 భాగాలతో ఏర్పాటైన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం. గత ఏడు దశాబ్దాలుగా జరిగిన మార్పుల్లో ప్రస్తుతం భారత రాజ్యాంగంలో 448 ఆర్టికల్స్, 12 షెడ్యూళ్ళు, 25 భాగాలు ఉన్నాయని, కాలానుగుణంగా 106 సార్లు భారత రాజ్యాంగానికి సవరణలు జరిగాయని ఆయన చెప్పారు.

అనంతరం శ్రీ దాసరి చంద్రయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం పొందుపరచబడ్డాయని, దేశంలోని పౌరులందరికి రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించేలా రాజ్యాంగదినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యత సూత్రాలను పటిష్టం చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రాజ్యాంగ పరిషత్ చేసిన కృషిని స్మరించు కుంటూ పౌరులు తమ పౌర బాధ్యతలను, రాజ్యాంగం అందించిన హక్కులను గుర్తించేందుకు ఈ రాజ్యాంగ దినోత్సవ నిర్వహణ రిమైండర్‌గా పని చేస్తుందని చెప్పారు

ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి, సి ఓ లు శ్రీమతి సరోజ, శ్రీమతి అరుణ, శ్రీమతి సుజాత, శ్రీమతి సునీత, శ్రీ హరికిషన్, వాష్ జిల్లా సమన్వయకర్త శ్రీ మైత్రి ప్రవీణ్, వివిధ సమాఖ్యల ఆర్పీలు సుమారుగా 60 మంది పాల్గొన్నారు. ఆ తర్వాత అందరితో భారత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ■

# బిందు, తుంపర సేద్యం రైతులకు 55శాతం రాయితీ!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల్ని బిందు, తుంపర సేద్యం వైపు ప్రోత్సహించే దిశగా మరో కీలక ముందడుగు వేసింది. బిందు, తుంపర సేద్యానికి సంబంధించి గణనీయమైన రాయితీలు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఇకపై తమ స్మార్ట్‌ఫోన్‌ల నుంచే బిందు, తుంపర సేద్య (మైక్రో ఇరిగేషన్) పరికరాలను ఆన్ లేదా ఆఫ్ చేయవచ్చు. ఈ కొత్త విధానంతో రైతులు తమ పొలాల్లో నీటిపారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చు. మొబైల్ ద్వారా ఎక్కడి నుంచైనా నీటి సరఫరాను నియంత్రించడం వల్ల సమయం ఆదా అవుతుంది. అలాగే నీటి వృధాను తగ్గించి, పంటలకు అవసరమైన మేరకే నీటిని అందించవచ్చు. ఇది పంట దిగుబడిని పెంచడానికి కూడా దోహదపడుతుంది.

బిందు సేద్యం అంటే మొక్కల వేర్ల దగ్గర నేరుగా నీటిని చుక్కల రూపంలో అందించడం. తుంపర సేద్యం అంటే నీటిని చిన్న చిన్న తుంపరల రూపంలో మొక్కలపైకి చిలకరించడం. ఈ రెండు పద్ధతులు నీటిని ఆదా చేయడంలో చాలా ఉపయోగపడతాయి. ఇప్పుడు ఈ పద్ధతులకు వైర్‌లెస్ ఆటోమేషన్ జోడించడం వల్ల రైతుల పని మరింత సులభతరం అవుతుంది. ప్రభుత్వం ఈ ఆటోమేషన్ పరికరాల ఏర్పాటుకు యూనిట్ వ్యయాన్ని హెక్టారుకు రూ. 40వేలుగా నిర్ణయించింది.

ఇందులో భాగంగా, ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు యూనిట్ వ్యయంలో 55% రాయితీ ఇస్తుంది. అంటే రూ. 40వేల యూనిట్ వ్యయంలో వారికి రూ. 22వేలు రాయితీ వస్తుంది (ప్రభుత్వం భరిస్తుంది), రూ. 18 వేలు మాత్రమే. మిగిలిన రైతులకు 45% రాయితీ లభిస్తుంది. దీని ప్రకారం, వారికి రూ. 18వేల రాయితీ వస్తుంది (ప్రభుత్వం భరిస్తుంది), రూ. 22 వేలకు వస్తుంది. ఈ ఆటోమేషన్ అమలుకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం, అర్హులైన రైతులు ఈ పథకం కింద రాయితీ పొందవచ్చు. దీనివల్ల ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవడానికి రైతులకు అవకాశం లభిస్తుంది.

రైతులు ఇప్పుడు వైర్‌లెస్ ఆటోమేషన్‌ను తమ సూక్ష్మ సేద్యంలో వాడుకోవచ్చు. దీనికి దరఖాస్తు చేసుకుంటే, నిబంధనల ప్రకారం రాయితీ లభిస్తుంది. కొత్తగా సూక్ష్మ సేద్య పరికరాలు కొనేవారు ఆటోమేషన్‌కు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. స్టార్టర్లు, వాల్వ్ ఆన్/ఆఫ్ చేసే పరికరాలు, ఇతర సెన్సర్‌లను రైతులు అమర్చుకోవచ్చు. యూనిట్ విలువ గరిష్ఠంగా రూ. 40 వేలుగా పరిగణించి, దానికి తగ్గట్టుగా రాయితీ ఇస్తారు.

ఈ వైర్‌లెస్ ఆటోమేషన్‌తో రైతులు తమ వ్యవసాయ పనులను సులభతరం చేసుకోవచ్చు. నీటిపారుదల, ఇతర పనులను దూరం నుంచే నియంత్రించవచ్చు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, వనరుల వృధాను కూడా తగ్గించవచ్చు. రాయితీ పొందడానికి రైతులు సంబంధిత అధికారులను సంప్రదించి, అవసరమైన దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి. ■

## తాగునీటితో కారు కడిగినందుకు జరిమానా

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో జలమండలి సరఫరా చేసే తాగునీటితో కారు కడిగిన వ్యక్తికి అధికారులు రూ. 10 వేల జరిమానా విధించారు. వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లో ఓ వ్యక్తి జలమండలి సరఫరా చేస్తున్న నీటితో కారు కడగడం చూశారు. దీంతో ఎండీ తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించడం ఏమిటని ఆతనిని నిలదీశారు. అతడికి జరిమానా విధించాలని ఆదేశించారు. అధికారులు సదరు వ్యక్తికి రూ. 10 వేల జరిమానా విధించారు. ■

తనకు ఆమోదయోగ్యం కాకపోయినా ఎదుటివారి మాటలను విని, ఆలోచించే స్వభావమే మానసిక సంస్కారం

# స్వయం సహాయ మహిళలకు వడ్డీ లేని రుణాలు

**రా**ష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. తాజాగా మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది.

సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క.... ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు.

ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు.

అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చెల్లెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను ప్రారంభిం చిందని గుర్తు చేశారు.

మహిళలకు నిధులను సమీకరించడమే కాదు.. ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. తాజాగా రూ. 304 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినాయి.

## డ్వాక్రా మహిళలకు బైక్, స్కూటీ, ఆటో

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉండి, ద్విచక్ర వాహన లైసెన్స్ కలిగి, ద్విచక్ర వాహనం నడిపే మహిళలు స్వయం ఉపాధి పొందేలా అవకాశం కల్పిస్తోంది. మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఈ–వాహనాలిచ్చి (ఎలక్ట్రిక్ బైక్‌లు) మహిళలకు తోడ్పాటు అందిస్తుంది.. వారు ఆర్థిక ప్రగతి సాధించేలా అండగా ఉంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే డ్వాక్రా మహిళలకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. ర్యాపిడోతో కలిసి మెప్మా ఇప్పటికే రాష్ట్రంలో పలు చోట్ల 'పింక్ మొబిలిటీ' పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. అర్హత ఉన్న మహిళలకు ర్యాపిడో వాహనాలు అందిస్తారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు..

మహిళలు స్వయం ఉపాధి కింద బైక్, స్కూటీ, ఆటోలను డ్వాక్రా గ్రూప్ ద్వారా తీసుకుంటే సబ్సిడీ కూడా అందిస్తారు. స్కూటీ, బైక్ తీసుకునేవారికి రూ.12 వేలు.. అదే ఆటో అయితే రూ.30 వేలు సబ్సిడీ ఇస్తారు. మహిళలు మరిన్ని వివరాల కోసం ఆయా జిల్లాల్లోని మెప్మా అధికారుల్ని సంప్రదించాలని సూచిస్తున్నారు. ■

జీవితమంటే గొప్ప పాండిత్యమో, ఆభరణాలో, ఆడంబరంగా బతకడమో కాదు; ఇతరులకు నీవు పంచే ఆనందం మాత్రమే

# శ్రీ రామారెడ్డి సంతాప సభలో సి ఎస్ రెడ్డి ఘన నివాళి

(10వ పేజీ తరువాయి ...)

అవి స్వయం శక్తితో బలోపేతం అయ్యే విధంగా రామారెడ్డి గారు, ఏపిమాస్ కలసి కృషి చేయడం జరిగింది. ఈ సందర్భంగానే రామారెడ్డి గారు, శశి రాజగోపాలన్ గారు 'సంఘాలు మనవి, సమాఖ్యలు మనవి, పాలన మనది, నియంత్రణ మనది' అనే ఒక నినాదాన్ని తయారుచేశారు. మనదేశంలో వున్న సుమారు ఒక కోటి 40 లక్షల మహిళా సంఘాలు, వాటిలో సభ్యులుగా వున్న 15కోట్ల మంది మహిళలు రామారెడ్డి గారి సి డి ఎఫ్, సహ వికాస సంస్థల నుంచి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్ఫూర్తి పొందారన్నది నా ఉద్దేశం.

రామారెడ్డి గారితో ఏపిమాస్ కలసి పని చేసిన రెండవ అంశం 97 వ రాజ్యాంగ సవరణపైన. దానిని గుజరాత్ హైకోర్టు కొట్టివేసింది. దేశమంతటా ఆ చట్టం రద్దుకావాలనే సంకల్పంతో దానిపైన మేము చట్టపరంగా పోరాటం చేశాం. ఆంధ్ర ప్రదేశ్, కర్ణా టక, బీహార్,పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల కోర్టులలో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు వేశాం. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు తయారుచేయడం, వివిధ రాష్ట్రాలలో అమలులో వున్న చట్టాలను విశ్లేషించడం వీటన్నిటిని రామారెడ్డి గారు చూసేవారు. ఆయనకు చట్టం మీద అంత పట్టు వుండేది. మేము ఆయన చెప్పింది చేసే వాళ్ళం. ఎందుకంటే రామారెడ్డి గారు ఆలోచిస్తే మళ్ళీ మనం ఆలోచించవలసిన పని వుండేది కాదు. ఆయన ఆలోచనలు అంత పకడ్బందీగా వుండేవి.

పాల సంఘాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తెచ్చిన ఒక ఆర్డినెన్స్ పై రామారెడ్డి గారు, జె పి గారు మొదలైనవారు న్యాయ పోరాటం చేశారు. ఈ ఆర్డినెన్స్‌పై తీర్పులో 'సహకార సంస్థలను ఏర్పాటుచేసుకోవడం ప్రజలకు రాజ్యాంగం యిచ్చిన హక్కు' అని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశాన్ని పొందుపరుస్తూ 97వ రాజ్యంగ సవరణపైన పోరాటం సాగించాం. చివరకు సుప్రీం కోర్టు కూడా 97 వ రాజ్యంగ సవరణలో రాష్ట్రాలకు సంబంధించిన అంశాన్ని కొట్టివేసింది. ఈ సందర్భంగా మేము సహవికాసతో కలిసి కొన్నివర్క్ షాప్‌లు, సదస్సులు నిర్వహించాము. ఈ విధంగా నాకు రామారెడ్డి గారితో పరిచయం పెరిగే అవకాశం, ఆయన నుంచి నేర్చుకునే అవకాశం కలిగింది. ఆయనలోని మరో విశేషమైన లక్షణం ఏమిటంటే, ఆయనతో ఎంత క్లిష్టమైన విషయం చర్చకు తెచ్చినా, ఆయన ఎంతో ప్రశాంతంగా విని, సమాధానం చెప్పేవారు.

ఇక, మూడవ విషయం ప్రభుత్వమే కొన్ని సంస్థలను స్వచ్ఛంద సంస్థలుగా ఏర్పాటు చేయడం. డి ఆర్ డి ఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ), సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) వంటివి. ఇలా ప్రభుత్వమే స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేయడాన్ని రామారెడ్డి గారు వ్యతిరేకించే వారు. స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేయడం ప్రజల హక్కు అని, అది ప్రజలకే పరిమితమని ఆయన గట్టిగా భావించేవారు. అందువల్ల ఈ విషయంలో కూడా పోరాటం చేయాలని ఆయన భావించారు. కొంత పోరాటం చేశారు కూడా. దేశమంతటా సహకార సంస్థలు స్వయం ప్రతిపత్తి, స్వయం పాలన, స్వయం నియంత్రణతో వుండాలనేది ఆయన ప్రగాఢ వాంఛ.

**చివరి కోరిక**

ఇటీవల రెండు మూడు నెలల క్రితం ఆయనను కలిసి నప్పుడు, ఆయన ఈ విషయాన్నే ప్రస్తావించారు. ఒకరకంగా యిది తన చివరి కోరికగా రామారెడ్డిగారు చెప్పారు. సహ వికాస, ఏపిమాస్ కలిసి విధానపరమైన సలహా సంప్రతిం పుల (పాలసీ అడ్వోకసి) ద్వారా ప్రభుత్వానికి ఈ అంశంపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకారోద్యమ సంవత్సరంగా ప్రకటించారు. ఈ సంవత్సరమే రామారెడ్డి గారు పరమ పదించారు. కాబట్టి ఆయన ఎప్పుడూ మనకు గుర్తుంటారు. ఇంకొక విషయం ఏమిటంటే, మన సంస్థలను మనం సక్రమ నిర్వహణతో పారదర్శకంగా నడుపుకుంటే, ఎవ్వరూ మన జోలికి రాలేరు. ఇప్పుడు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్

**ఆశాభావాన్ని మించిన కానుక లేదు, అనుభవ పాఠాలు నేర్పుతూ పరాజయం నుంచి విజయానికి చేర్చే నిచ్చెన అది**

# అమ్మాయిల జీవితాల్లో 'అభయ విద్యానిధి' వెలుగులు!

**ఒ**క చిన్న నిప్పురవ్వ ఏ విధంగా అయితే కారు చీకటిని సైతం పారదోలగలదో అలాగే సాయం అందించే చేయి కూడా కష్టాలూ, కన్నీళ్లే జీవితంగా గడిపే వారి జీవితాల్లో వెలుగులు నింపగలదు. ప్రస్తుతం అనంతపురం జిల్లా గుంతకల్లులోని అభయ విద్యా నిధి సొసైటీ అలాంటి సాయమే అందిస్తోంది. 'మేడమ్ నాకు డిగ్రీలో మంచి మార్కులు వచ్చాయి. ఆర్థిక సమస్యల కారణంగా ఉన్నత చదువులు చదవలేకపోతున్నాం. సాయం చేస్తారా?' అని ఏ అమ్మాయైనా సొసైటీని ఆశ్రయిస్తే కాదనకుండా ఆర్థిక సాయం అంది స్తోంది. నిధుల కోసం హుండీలను ఏర్పాటు చేసి మరీ విరాళాలను సేకరిస్తోంది. అలా ఇప్పటివరకూ వందలాది మంది జీవితాల్లో చదువుల వెలుగులు నింపుతున్నారు. ఈ సొసైటీని మహిళలే నడుపుతున్నారు.

కొంతమంది బాలికలు పాఠశాలకు వెళ్లకుండా ఇళ్లలో పాచి పనులకు కొందరూ బాలికలు వెళ్తుంటే చూసి స్కూలుకి ఎందుకు వెళ్లలేదని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు సత్రసాల వసుంధర ఆరా తీశారు. 'మాకు చదువుకోవాలన్న ఆశ ఉన్నా, చదివించే స్థోమత మా అమ్మానాన్నలకు లేదని సమాధానామిచ్చారు వాళ్లు. దానికి ఆమె చలించిపోయారు. అప్పటి నుంచి నిరుపేద బాలికల చదువు గురించి ఆలోచించడం మొదలు పెట్టారు.

అప్పట్నుంచీ అలాంటి అమ్మాయిల్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. దాంతో వారికి తెలిసిన వాళ్లతో చర్చించారు. నా ఆలోచన చెప్పగానే వాళ్లూ సానుకూలంగా స్పందించారు. తమ వంతు సహాయం అందిస్తామని చెప్పారు. అలా ఈ "అభయ విద్యానిధి సొసైటీ" 2015లో ప్రారంభించా అని వసుంధర గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం దేవరశెట్టి మాధవీలత అధ్యక్షురాలిగా 100 మంది సభ్యులతో ఈ సొసైటీ నడుస్తోంది.

**విరాళాల కోసం హుండీలు :** వంద మంది సభ్యులు మాత్రమే విరాళాలే ఇస్తే సహాయం తక్కువ సంఖ్యలో అందుతుంది. అలా కాకుండా దీని పరిధిని విస్తరించాలను కున్నాను. అందుకే విరాళాల కోసం హుండీలు ఏర్పాటు చేశాం. వీటిలో ఎవరికి నచ్చిన మొత్తం వాళ్లు వేసేవారు. తరువాత హుండీల అవసరం లేకుండానే దాతలు నెలకు రూ.1000 చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేయడం మొదలు పెట్టారు. దీన్ని పిల్లల చదువులకు కేటాయిస్తున్నాం. సాయం పొందిన వారిలో ఇంజినీరింగ్, మెడిసిన్, నర్సింగ్, లా, బీఈడీ వంటివి చదువుకున్న అమ్మాయిలూ ఉన్నారు. నిరుపేద మహిళలు ఆర్థిక స్థోమత లేక చదువును ఆపేయకూడదు. ఆ లక్ష్యంతోనే సొసైటీ నడుపుతున్నామని వ్యవస్థాపకులు అంటున్నారు. ■

## శ్రీ రామారెడ్డికి సి ఎస్ రెడ్డి నివాళి

ఇంటలిజెన్స్) కూడా అందుబాటులో వున్నది కాబట్టి , మరింత పకడ్బందీగా మనం లెక్కలు, రికార్డులు నిర్వహించుకో గలుగుతాం.

ఇప్పటివరకు రామారెడ్డి గారితో నాకున్న సాన్నిహిత్యం వల్ల నాకు అర్థమైంది ఏమిటంటే ప్రజల శక్తి సామర్థ్యాలు పూర్తిగా బయటకు రావాలంటే ప్రజలే సంస్థలను నిర్మించుకుని, వాళ్ళే నడుపుకునే విధంగా వుండాలి, ప్రభుత్వ అధీనంలో కాని, మరి ఏ అజమాయిషీలో కాని వుండ కూడదని, వుంటే స్వార్థం వచ్చి ప్రజలకు మేలు జరగదని రామారెడ్డి గారు గట్టిగా విశ్వసించే వారు. అందువల్ల మనందరం సహకార ఉద్యమాన్ని, సహకార వ్యవస్థలను బలోపేతం చేయడానికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేయడం, వాగ్దానం యివ్వడం, దానిని ఆచరణలో పెట్టడమే రామారెడ్డి గారికి మనం యిచ్చే నిజమైన నివాళి అవుతుంది. ఇక్కడవున్న 550 సహకార సంస్థలకు చెందిన దాదాపు రెండున్నర లక్షలమంది ఉద్యమకారులుగా కృషి చేస్తే మనం ఆశించేది సాధించగలుగుతాము. దాని ద్వారా రామారెడ్డి గారు ఎల్లకాలం మన కార్యక్రమాలలో వుండిపోతారు. ■

ద్వేషించడం కాక ప్రేమించడం, అనుకరించడం కాక అనుసరించడం, పొగడడం కాక అభినందించడం నేర్చినవాడు వివేకి

# పిల్లలు ఒంటరిగా వుంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

**పి**ల్లల్ని ఇంట్లో వదిలి వచ్చేశాం, ఎలా ఉన్నారో ఏంటో? ఉద్యోగాలు చేసే ప్రతి తల్లిదండ్రుల ఆలోచన ఇది. ఒక గది నుంచి ఇంకో గదికి రెప్పపాటులో మాయమవుతుంటారు చిచ్చర పిడుగులు. కంటికిరెప్పలా కాపాడుతున్నా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. వారికోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

**మండే వస్తువులకు దూరంగా :**

- ♦ బయటకు వెళ్లేటప్పుడు గ్యాస్ రెగ్యులేటర్ తప్పనిసరిగా ఆపాలి.
- ♦ వండిన ఆహార పదార్థాలు వేడిగా ఉంటే, వాటిని పిల్లలకు అందేలా ఉంచకూడదు. వేడి పదార్థాలు మీద పడినా, పిల్లలు వాటిలో చేతులు పెట్టినా కాలి గాయాలవుతాయి.
- ♦ పిల్లలు తినేందుకు సిద్ధం చేసిన పదార్థాలను కిచెన్ గట్టుపై కాకుండా హాల్, వాళ్లు ఆడుకునే గదికి దగ్గరగా అందుబాటులో ఉంచితే వారు తీసుకొని తినేందుకు వీలుంటుంది. లేకపోతే వంటగదిలోకి వెళ్లి ఆ పదార్థాలు తీసుకునే క్రమంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది.
- ♦ బాత్రూమ్‌లో వాటర్ హీటర్ ప్లగ్‌ను తొలగించాలి.

**విద్యుత్ ఉపకరణాలు :**

- ♦ పిల్లలు విద్యుత్తు ప్రమాదాల బారినపడకుండా సురక్షితమైన చర్యలు తీసుకోవాలి.
- ♦ ఇంట్లో సరిగాలేని వైరింగ్ను అలాగే వదిలేయకుండా సరి చేయాలి. వైర్లు వేలాడకుండా టేపుతో చుట్టి పిల్లలకు అందకుండా చూడాలి.
- ♦ స్విచ్ బోర్డులు కింద ఉంటే పిల్లలు వాటిలో చేతులు పెట్టే అవకాశం ఉంది. ప్లగ్‌లోకి ఏవైనా ఆట వస్తువులు పెడుతుంటారు. వీలుంటే స్విచ్ బోర్డులను పైకి మార్పించాలి. కుదరకపోతే కింద ఉన్న స్విచ్ బోర్డు వారికి అందకుండా జాగ్రత్తపడాలి.
- ♦ హైవోల్టేజ్ విద్యుత్తు ఉపకరణాలకు సంబంధించిన స్విచ్లు తప్పనిసరిగా ఆఫ్ చేయాలి.
- ♦ కొందరు ఐరన్ బాక్స్ ప్లగ్‌ని, స్విచ్‌బోర్డుకు అలాగే వదిలేస్తారు. పిల్లలున్న ఇంట్లో ఇది ప్రమాదకరం. బట్టల ఐరన్ పూర్తయిన వెంటనే ప్లగ్ తొలగించాలి. విద్యుత్తు పరికరాల విషయంలో జాగ్రత్తగా ఎలా ఉండాలనేది పిల్లలకు నేర్పాలి.

**స్మోక్ అలారం ఉందా? :**

ఇంట్లో తల్లిదండ్రులు, పెద్దలు లేకుండా పిల్లలు మాత్రమే ఉన్నప్పుడు అగ్నిప్రమాదాలు జరిగితే నష్టం తీవ్రంగా ఉంటుంది. పిల్లలు ప్రమాదాలను వెంటనే గుర్తించ లేరు. తీరా గుర్తించాక తప్పించుకోవడం తెలియక ఆందోళన చెందుతారు. అందుకే ఇంటిలో స్మోక్ అలారాన్ని ఏర్పాటుచేసి, దానిని తరచూ పరీక్షిస్తుండాలి.

**రసాయనాలు, టానిక్లు :** సాధారణంగా ఏ వస్తువునైనా నోటిలో పెట్టుకోవడం ఎక్కువమంది పిల్లలకు అలవాటుగా ఉంటుంది. అందుకే డిటర్జంట్లు, రసాయన ద్రావణాలు పిల్లలకు అందుబాటులో ఉంచకూడదు. మందులు, సిరప్‌లు కూడా పిల్లలకు అందుబాటులో ఉంచొద్దు. పొరపాటున ఆ మందులు వేసుకున్నా, సిరప్‌లు తాగేసినా అనారోగ్యానికి గురవుతారు.

**చిన్న వస్తువులే కదా అని :**

- ♦ పిల్లలు తిరిగే ప్రదేశంలో పదునైనవి ఏమీ లేకుండా చూడాలి. వాళ్లు పరుగులు పెట్టి ఆడుకునే సమయంలో పదునైన వస్తువులుంటే అవి తగిలి ప్రమాదం బారినపడే అవకాశం ఉంటుంది.
- ♦ కిటికీల తలుపులు ఇంటి లోపలివైపు ఉంటే, వాటిని మూసేయాలి. పిల్లలు ఆడుకొని పైకి లేచినప్పుడు కిటికీ

### పదేళ్లలోపు పిల్లలకు చెప్పకూడని విషయాలు

**చి**న్న చిన్న పనులు చెప్పి చేయించడం వల్ల పిల్లలు బాధ్యతాయుతంగా మెలగడం నేర్చుకుంటారు. కానీ పదేళ్లలోపు పిల్లలకు కొన్ని పనులు చెప్పకూడదని నిపుణులు సూచిస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం...

- ♦ పదేళ్లలోపు పిల్లలకు గ్యాస్ స్టవ్ వెలిగించడం, కెటిల్ ఉపయోగించడం, ఇస్త్రీ చేయడం లాంటి పనులు చెప్పకూడదు.
- ♦ కూరగాయలు కోయడం, వేటినైనా కత్తిరించడం, మిక్సీ లేదా బ్లెండర్ వాడడం లాంటి పనులు చెప్పకూడదు.
- ♦ అటక మీద నుంచి వస్తువులు దించడం, బరువైన వస్తువులను ఎత్తడం, లగేజ్ బ్యాగ్‌లు పట్టుకుని మెట్లు ఎక్కడం లేదా దిగడం లాంటి పనులను పురమాయించ కూడదు. నీళ్ల బిందెలు లేదా బకెట్లు మోయడంలాంటివి కూడా చెప్పకూడదు. ఇలాంటి పనులు చేయడం వల్ల పిల్లల్లో వెన్ను నొప్పి, కండరాలు పట్టేయడం లాంటి సమస్యలు వస్తాయి.
- ♦ చిన్న పిల్లలకు వ్యాక్యూమ్ క్లీనర్, రైస్ కుక్కర్, ఎలక్ట్రిక్ స్టవ్, ఓవెన్‌లతో చేసే పనులు చెప్పకూడదు.
- ♦ రకరకాల క్లీనర్స్, యాసిడ్, బ్లీచింగ్ పౌడర్‌లతో చేసే పనులను పిల్లలకు చెప్పకూడదు.
- ♦ గోడలకు మేకులు కొట్టడం, బజారు నుంచి మందులు తీసుకురమ్మనడం, నిచ్చెన ఎక్కడం లాంటి పనులను కూడా చిన్న పిల్లలకు చెప్పకూడదు.

తలుపు తగిలి తలకు దెబ్బతగులుతుంది.

- ♦ పిల్లలు ఆడుకునే బొమ్మల్లో అతి చిన్నవి, నాణేలు అందుబాటులో ఉంచకూడదు. వాటిని మింగితే ప్రమాదం కోరితెచ్చుకున్నట్లు అవుతుంది.

**పెంపుడు జంతువులతో జాగ్రత్తలు :**

ఇంట్లో పెంపుడు జంతువులను, పిల్లలు తమ తోటి స్నేహితుల్లా భావించి వాటితో సరదాగా ఉంటారు. అయితే, కొన్ని సందర్భాల్లో వాటితో అప్రమత్తంగా ఉండాలని పిల్లలకు నేర్పించాలి. పెంపుడు జంతువులు తినే సమయంలో, అవి నిద్రిస్తున్న వేళ, వాటి పిల్లలతో ఉన్నప్పుడు చిన్నారులు, వాటి వద్దకు వెళితే దాడిచేసే అవకాశం ఉంటుంది. ఈ విషయాల్లో పిల్లలకు ముందే జాగ్రత్తలు తెలియజేయాలి.

**నిరంతరం పర్యవేక్షణ :**

ఇంటిలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండొచ్చు. హాల్, పిల్లలు ఆడుకునే గది, కిచెన్, ఇంటి ముందు, తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకుంటే పిల్లలు ఏం చేస్తున్నారనేది ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు.

(ఈనాడు సౌజన్యంతో ...)

## పెద్ద పేగు క్యాన్సర్‌కు పిప్పళ్లతో చెక్!

*__మ__న వంటిళ్లలో సులభంగా కనిపించే మసాలా దినుసు పిప్పళ్లు (తోక మిరియాలు) ప్రాణాంతకమైన పెద్ద పేగు క్యాన్సర్ (కొలన్ క్యాన్సర్)ను నివారించగలవని తాజా పరిశోధనలో తేలింది. పిప్పళ్లలో సహజంగా లభించే 'పిప్లార్టైన్' (పైపర్ లాంగమీన్) అనే రసాయనానికి క్యాన్సర్ కణాలను సమర్థంగా నాశనం చేసే శక్తి ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు.*

*రూర్కెలలోని ఎన్‌ఐటీ పరిశోధకులు, బిహార్ సెంట్రల్ యూనివర్సిటీ, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినాకు చెందిన బృందాలు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించాయి. ప్రస్తుతం పెద్ద పేగు క్యాన్సర్‌కు కీమోథెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నారు.*

*పిప్లార్టైన్‌ను పెద్ద పేగు క్యాన్సర్ కణాలపై ప్రయోగించి నప్పుడు అద్భుతమైన ఫలితాలు వచ్చినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ ఆవిష్కరణ క్యాన్సర్ చికిత్సలో ఒక వరం లాంటిదని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ అధ్యయనానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రముఖ సైన్స్ జర్నల్ 'బయోఫ్యాక్టర్స్'లో ప్రచురించారు.*

■

# వేడుకలలో అలంకరణకు అద్దె మొక్కలు !

వివాహాలు, గృహ ప్రవేశాలు, వాణిజ్య సముదాయాల ప్రారంభోత్సవాల సందర్భంగా అలంకరణ మొక్కలకు ప్రాధాన్యం పెరుగుతోంది. మొక్కలు, చిన్నపాటి చెట్ల అలంకరణతో వేదిక అందం రెట్టింపవుతోంది. దీనికి అవసరయ్యే మొక్కలన్నీ కొనుగోలు చేసి తేవాలంటే సాధ్య మయ్యే వ్యవహారం కాదు. ఈ క్రమంలో మొక్కలను అద్దెకు ఇచ్చే పద్ధతి మొదలైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు అన్ని నర్సరీల నిర్వాహకులు రోజుల లెక్కన, గుత్త ఒప్పందాలు, ఇతర పద్ధతులలో అలంకారప్రాయమైన మొక్కలను అద్దెకు ఇస్తున్నారు.

వీటిని ప్రధానంగా ఇంట్లో, కార్యాలయాల్లో ఏవైనా ప్రత్యేక కార్యక్రమాల్లో వీటిని ఎంపిక చేసుకుంటున్నారు. దీని ద్వారా మొక్కలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా అద్దె ప్రాతిపదికను తీసుకోవచ్చు. మొక్కలను పూర్తిగా కొనుగోలు చేయడం కంటే అద్దెకు తీసుకోవడం తక్కువ ఖర్చుతో కూడినదై ఉంటుంది. అంతేకాకుండా మొక్కల నిర్వహణకు సంబంధించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**అద్దె ప్రాతిపదికన రెడీమేడ్ మొక్కలు :** పచ్చని పొదరిల్లులాంటి వేదికలో వివాహ వేడుక నిర్వహించాలని ఏలూరుకు చెందిన ఓ కుటుంబం నిర్ణయించింది. వేదిక అలంకరణ బృందానికి ఈ పని అప్పగించారు. దీని నిర్వాహకుడు నగరంలో ఓ నర్సరీకి వెళ్లి అక్కడ ఆకర్షణీయం గా ఉన్న పలు రకాల మొక్కలను ఎంపిక చేసి ఆ తర్వాత అద్దె ప్రాతిపదికన లారీపై కల్యాణ వేదికకు తరలించారు.

ముఖ్యంగా వేదిక ప్రాంగణమంతా అలంకరణ మొక్క లను ఉంచి, మండపం పైభాగాన్ని వివిధ రకాల పాదులతో ముచ్చటగా తీర్చిదిద్దారు. వస్త్ర, నగల దుకాణాల ప్రారం భోత్సవాలకు వీటిని విరివిగా వినియోగిస్తున్నారని ఏలూరు లోని అశోక్ నర్సరీ యజమాని శ్రీను వెల్లడించారు. మొక్క రకం, దాని సైజును బట్టి ఒక్కోదానికి రోజుకు రూ. 30 నుంచి రూ. 50 వరకు అద్దె ఉంటుందని తెలిపారు. పచ్చని మొక్కలు అతిథులకు ఆహ్లాదం పంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**అద్దె మొక్కలకు పెరుగుతున్న డిమాండ్ :** పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఉన్న నర్సరీ నిర్వాహకులు ఆటోలో పట్టినన్ని మొక్కలు ఇచ్చి రోజుకు రూ. 2,000 నుంచి రూ. 3,000 వరకూ అద్దె తీసుకుంటున్నారు. ప్రముఖ నాయకుల పర్యటనలు, సభల్లోనూ అలంకరణ మొక్కలకు వీటికి ఆదరణ దక్కుతుంది. అంతేకాకుండా ఆలయాల్లో నిర్వహించే వేడుకలకు అలంకరణకు ఆయా కమిటీలు ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా కుండీలను కొనుగోలు చేస్తున్నాయి.

మొక్కలతో ఉన్న కుండీలను తీసుకొచ్చి కార్యక్రమాలు ముగిసే వరకు వినియోగిస్తున్నారు. అనంతరం కుండీలతో సహా మొక్కలను నర్సరీలకు ఇచ్చేస్తున్నారు. ఈ రకమైన విధానం ఇరువురు వ్యక్తులకు గిట్టుబాటు అవుతుందని యలమంచిలి శివాలయం కమిటీ సభ్యులు తెలిపారు. ■

## వరిని మింగిన మొంథా

ఆంధ్రప్రదేశ్‌లో మొంథా తుఫాన్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా 1,57,941 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మొత్తంగా 3,10,784 మంది రైతులు నష్టపోయినట్లు నిర్ధారించామన్నారు. కాగా, వరి పండించిన రైతులకే ఎక్కువగా నష్టం జరిగిందని 1,29,635 హెక్టార్లలో వరి నీట మునిగడం, వాలిపోవడం వంటివి జరిగాయన్నారు. తర్వాతి స్థానాల్లో పత్తి, మొక్కజొన్న పంటలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రకాశంలో 12,347, బాపట్లలో 11,772, నంద్యాలలో 11,454, గుంటూరులో 2,059, కడపలో 1,756, పల్నాడులో 1,719, శ్రీకాకుళం జిల్లాలో 1,428 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు వివరించారు. ■

# 'పాడి రైతులకు అండగా వున్నందుకే అవార్డు'

**ఆ**మె ఫార్మసీ రంగంలో రాణించాలనుకున్నారు... కానీ, ఆర్థిక పరిస్థితులు... వెటర్నరీ వైపు నడిపించాయి. అయితేనేం, అందులోనూ అద్భుతాలు చేస్తున్నారు. ముఖ్యంగా పశువులకు కృత్రిమ గర్భధారణ పద్ధతులను చురుగ్గా అమలు చేస్తున్నందుకే నంద్యాల జిల్లా చింతకుంట జూనియర్ వెటర్నరీ అధికారిణి అనురాధను 'జాతీయ గోపాలరత్న అవార్డు' వరించింది.

నా స్వస్థలం నంద్యాల. నాన్న సుబ్బరాయుడు రజక వృత్తి చేస్తూ నన్ను చదివించారు. అమ్మ లక్ష్మీదేవి గృహిణి. ఇంటర్ బైపీసీ గ్రూపు తీసుకుని 75శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. తరవాత ఫార్మసీ కోర్సులో చేరాను. ఈ రంగంలో రాణించాలనేది నా లక్ష్యం. కానీ, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు పడ్డాయి. దీంతో ఫార్మసీని వదిలి ఆ పరీక్షకు సన్నద్ధమవ్వడం మొదలుపెట్టా.



2004వ సంవత్సరంలో నిర్వహించిన ఈ పరీక్ష కోసం 350 మంది పోటీపడ్డారు. ఎంపికైన ఆరుగురిలో నేనొకదాన్ని. శిక్షణ అనంతరం 2006లో బండి ఆత్మకూరులో తొలి పోస్టింగు. 2013లో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా, 2019లో జూనియర్ పశువైద్య అధికారిణిగా పదోన్నతి పొందాను. తర్వాత కొన్నాళ్లు గోపవరంలో విధులు నిర్వర్తించా. ఆ సమయంలోనే దేశంలో పశుసంపదను పెంచడానికి కేంద్రం 'సెక్స్ సోర్టెడ్ సెమెన్ కృత్రిమ గర్భధారణ' (ట్రిపుల్ ఎస్ ఏఐ) విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఇది పాడి రైతులకు ఆర్థికంగా మేలు చేస్తుందనే ఆలోచనతో పశువులకు పెద్ద ఎత్తున కృత్రిమ గర్భధారణలు చేయించా. దీనివల్ల 2024-25వ సంవత్సరంలో 345 వరకు మేలుజాతి పెయ్య దూడలు జన్మించాయి. ఆ కృషికే 'జాతీయ గోపాలరత్న అవార్డు'కు ఎంపికయ్యా. దేశం మొత్తమ్మీద అన్ని కేటగిరీలకు కలిపి మొత్తం 2,081 మంది పోటీపడగా మూడు కేటగిరీల్లో కేవలం 9మందికి అవార్డులను ఇవ్వనున్నారు. వారిలో నేను జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచా.

(ఈనాడు సౌజన్యంతో)

## పాల వినియోగంలో ఏపీ టాప్ !

**త**లసరి పాల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ జాతీయ సగటును అధిగమించింది. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తి రోజుకు సగటున 719 గ్రాముల పాలు వినియోగిస్తుండగా, జాతీయ సగటు కేవలం 459 గ్రాములుగా ఉందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు తెలిపారు. 2033 నాటికి రాష్ట్రంలో పాల ఉత్పత్తిని 150 లక్షల టన్నులకు పెంచి, దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.

జాతీయ పాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఏపీ 139.46 లక్షల టన్నుల పాల ఉత్పత్తితో దేశంలో 7వ స్థానంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పాలు, పాల ఉత్పత్తుల విలువ రూ. 713.9 బిలియన్లు ఉందని, దీనిని 2033 నాటికి రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం పశుపోషకులకు అనేక రాయితీలు అందిస్తోందని దామోదర్ నాయుడు పేర్కొన్నారు. 2025 అఖిల భారత పశుగణన ప్రకారం రాష్ట్రంలో 46 లక్షల ఆవులు, 62.19 లక్షల గేదెలు ఉన్నట్లు ఆయన తెలిపారు. గత తొమ్మిదేళ్లలో జాతీయ పాల ఉత్పత్తి 58% వృద్ధి చెందిందని ఆయన తెలిపారు. ■

ఒకే పరిస్థితి మనోబలం క్షీణిస్తే సమస్యగా, స్థిరంగా వుంటే సవాలుగా, దృఢంగా వుంటే అవకాశంగా మారుతుంది


**మీకు తెలుసా ?**

గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - ❖ దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - ❖ 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - ❖ మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

## మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

## వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD-1064/2024-26

*Publication Date:01-12-2025* Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 *Posting Date: 05/06-12-2025*





జాతీయ పురస్కార మహోత్సవంలో ప్రసంగిస్తున్న తెలంగాణా ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ శ్రీ జి చిన్నారెడ్డి



పురస్కార మహోత్సవంలో ప్రముఖులకు సన్మానోత్సవం



సమాంతర సదస్సులు




అవార్డుల ప్రదానోత్సవంలో ఏపిమాస్ బృందం

To ADDRESS



నల్లమాడ సమాఖ్య గానుగ నూనె స్టాల్